




	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	27	32
భద్రాద్రి	22	30


సీతారామ ప్రాజెక్టు లింక్ కెనాల్ పనుల దృశ్యం


కాలువ సొరంగ పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

ఏడాదిన్నరలోగా 'సీతారామ' పనుల పూర్తి

- గత ప్రభుత్వం రీ డిజైన్ పేరుతో నిర్మాణ వ్యయం పెంచింది
- తప్పిదాలను సవరించి పనులు పూర్తిచేస్తాం
- మున్నేరు నీటిని పాలేరుకు తరలించేలా రిజర్వాయర్
- నిరుద్యోగ యువతను ప్రతిపక్షం పక్కదారి పట్టిస్తోంది
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- పాలేరు సీతారామ లింక్‌కెనాల్ పనుల పరిశీలన

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) / తిరుమలాయపాలెం/ కూసుమంచి, జూలై 2: రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా పాలేరు జలాశయానికి గోదావరి, కృష్ణాజలాలను అనుసంధానం చేసే పాలేరు లింక్ కెనాల్ పనులను ప్రారంభం నుంచి చివరి వరకు తిలకించారు. కాలవలు అక్విడెక్ట్‌లు, టన్నెల్స్ పనులను నిశితంగా పరిశీలించారు. కొన్నిచోట్ల పనులు అస్తవ్యస్థంగా ఉండడంపై అధికారులపైనిర్మాణ సంస్థ ప్రతినిధులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాలేరు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పాలేరు లింక్ కెనాల్‌పై మంత్రి పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి ఇరిగేషన్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో పరిశీలన చేశారు. ముందుగా రాళ్ల వాగు వద్ద వాగునీరు సీతారామ ఎత్తిపోతల నీరు వెళ్లే మార్గాన్ని ఆ తర్వాత ఆకేరు వద్ద నిర్మించిన అక్విడెట్‌ను పరిశీలించారు. అనంతరం తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డిగూడెం, దమ్మాయిగూడెంలో, కూసుమంచి మండలాల్లో నిర్మిస్తున్న టన్నెల్ పనులను మంత్రి పరిశీలించారు. కాలవ పనులను తిలకించారు. అనంతరం కూసుమంచిలో అధికారులతో సమీక్షనిర్వహించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

గత ప్రభుత్వ తప్పిదాలను సవరించి సీతారామ ఎత్తిపోతలను ఏడాదిన్నరలోగా పూర్తిచేస్తామన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజీవ్‌సాగర్ పేరుతో 2లక్షల75 ఎకరాలకు ప్రాజెక్టు పనులు చేపడితే రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం సీతారామ పేరుతో రూ.18వేల కోట్లతో అంచనాలు వేసి రూ.8వేలు కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదని, రూ1100కోట్లకు టెండర్ పిలిచి రూ.1900కోట్లకు రీటెండర్ పిలిచారని, మంత్రి పొంగులేటి వివరించారు. ఆనాడు ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ రాబోయే ఏడాదిన్నరలో సీతారామా సాగునీటి పూర్తి చేస్తామని పాలేరు లింక్‌కెనాల్‌ను కూడా పూర్తిచేస్తామని తెలిపారు వచ్చే ఆగస్టు 15 నాటికి మొదటి లిఫ్టు ప్రారంభించి ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా లక్షా2వేల ఎకరాలకు సాగునీరు అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆగస్టు 15న ప్రారంభిస్తామన్నారు.

సీతారామ లిఫ్టుల ద్వారా గోదావరి జలాలను స్టోరేజీ చేసేందుకు ప్రభుత్వం ఎక్కడా రిజర్వాయర్‌లు ఏర్పాటు చేయలేదని, మున్నేరు నీరు 40 టీఎంసీలు సముద్రంలో వృధాగా పోతుందని, మున్నేరును సీతారామ లింక్‌కెనాల్‌కు అనుసంధానం చేసి మున్నేరు నీరును పాలేరుకు తరలిస్తామని ఇందుకోసం రూ.100కోట్లతో 4వేల ఎకరాల్లో రిజర్వాయర్‌కూడా ఏర్పాటు ప్రతిపాదనలు చేస్తున్నామని,


పనులను పరిశీలిస్తున్న మంత్రి

తద్వారా వంద టీఎంసీల నీరు వరకు నిలవ ఉంచవచ్చని మంత్రి పొంగులేటి వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు కావాలని, ప్రజలు కోరుకుని ఈప్రభుత్వాన్ని తీసుకువచ్చారని, రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ2లక్షల రుణ మాఫీ చేయబోతున్నామని, పొంగులేటి వివరించారు. రాబోయే రెండు నెలల్లో అర్హులైన రైతులందరికి రుణమాఫీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని, ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా రైతులకు రుణమాఫీ చేసి తీరుతామన్నారు.

రాష్ట్రంలో యువతను పక్కదారి పట్టించేందుకు ప్రధాన ప్రతిపక్షం రెచ్చగొడుతుందని, పదేళ్లుగా యువతకు గత ప్రభుత్వం ఏమీచేయలేదని, ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తర్వాత మొదటి 90రోజుల్లోనే 30వేల ఉద్యోగాలు కలిపించామని గుర్తుచేశారు. కంచే చేను మేసినట్టుగా టీఎస్‌పీఎస్సీ ద్వారా పేపర్ లీక్ చేయించి వారి బంధవులకు ఉద్యోగాలు ఇప్పించుకున్నారని, టీఎస్‌పీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేసి అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగాలుకలిపించే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని పొంగులేటి తెలిపారు. ఈ విలేకరుల సమవేశంలో కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా సాగుభూములకు గోదావరి నీళ్లు అందించడం కోసం ఏర్పాటు చేసిన సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులో ఇల్లెందు నియోజక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యేలు గుమ్మడి నర్సయ్య, బానోతు హరిప్రియ ఆందోళన వ్యక్తం చేశారు. అఖిలపక్ష నాయకులు మంగళవారం సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు శంకుస్థాపన చేసిన రోళ్లపాడు రిజర్వాయర్‌ను సందర్శించారు. ముగ్గురు మంత్రులు తమ ప్రాంతానికి సాగునీరు రాకుండా కొత్త డిజైన్ పేరుతో అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

- ఇల్లెందు నియోజకవర్గానికి చుక్కనీరు రాని పరిస్థితి
- మళ్లీ విభజిత ఖమ్మం జిల్లాకే గోదావరి జలాలా?
- అక్కడి భూములకు సాగర్ జలాలు అందుతున్నాయి కదా..?
- ఇల్లెందుకు నీళ్లివ్వకపోతే ఉద్యమిస్తాం
- మాజీ ఎమ్మెల్యేలు గుమ్మడి నర్సయ్య, బానోత్ హరిప్రియ
- రోళ్లపాడు వద్ద 'సీతారామ' శంకుస్థాపన ప్రదేశాన్ని సందర్శించిన అఖిలపక్షం

రీ డిజైన్‌తో అన్యాయం


రోళ్లపాడు వద్ద మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు గుమ్మడి నర్సయ్య, బానోతు హరిప్రియ

అశ్వాపురం/ టేకులపల్లి/ జూలూరుపాడు, జూలై 2: సీతారామ ప్రాజెక్టుతో తమ ప్రాంతానికి ఎలాంటి లాభం లేదని మాజీ ఎమ్మెల్యేలు గుమ్మడి నర్సయ్య, బానోతు హరిప్రియ అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం కావాలనే ఉద్దేశ్యంతో కేసీఆర్ హయాంలో రోళ్లపాడును రిజర్వాయర్‌గా ప్రకటించి సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారన్నారు. కానీ ఇల్లెందు ప్రాంతానికి నీరివ్వకుండా రీడిజైన్ పేరున ఇతర ప్రాంతాలకు ప్రాజెక్టును తరలించారని వారు ఆరోపించారు. ఆ సమయంలో రాష్ట్రంలో మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేగా కోరం కనకయ్య ఉన్నారన్నారు. రెండో సారి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇల్లెందు నియోజకవర్గ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో రోళ్లపాడుకు నీరు మళ్లించేందుకు రూ.3,320కోట్ల వ్యయంతో డీపీఆర్ అడ్మినిస్ట్రేటివ్ అనుమతులు మంజూరుచేయగా ఫైనాన్స్ శాఖ వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉందని ఇంతలో ఎన్నికలు వచ్చాయన్నారు. ఇప్పుడు కూడా మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేగా కోరం కనకయ్య ఉండికూడా ఇల్లెందు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు నీళ్లు ఇవ్వకుండా ద్రోహం చేశారని ఆరోపించారు.

సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఇప్పటికే నాగార్జునసాగర్ నీళ్లు పారుతున్న ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాలకే సీతారామ నీటిని మళ్లించి గిరిజన నియోజకవర్గాల భూములకు సాగునీరు లేకుండా కుట్ర చేశారని ధ్వజమెత్తారు. ముందుగా గోదావరి నీళ్లు ఇల్లెందు నియోజకవర్గానికి వచ్చిన తర్వాతనే ఇతర ప్రాంతాలకు పంపాలని, లేకుంటే రైతు ఉద్యమాలకు పూనుకొంటామని హెచ్చరించారు. సీతారామ ప్రాజెక్టులో ఇల్లెందు నియోజక వర్గంలోని సాగుభూములకు జరుగుతున్న అన్యాయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి బ్రహ్మం జూలూరుపాడు మండలంలోని వినోభానగర్ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న సీతారామ లింక్ కెనాల్ నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఆ డిజైన్‌ను పక్కన పెట్టి, వారి స్వప్రయోజనాలు కోసం జూలూరుపాడు మండలంలోని వినోభానగర్ నుంచి ఏన్కూరు వరకు లింక్ కెనాల్ నిర్మాణాన్ని చేపడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దిండిగాల రాజేందర్, సీపీఐ నాయకులు దేవరకొండ శంకర్, బేతంపూడి సొసైటీ అధ్యక్షుడు లక్కినేని సురేందర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, పరచూరి వెంకటేశ్వరరావు, జాఫర్‌హుస్సేన్, ఎన్డీ నాయకులు నాయిని రాజు, బుర్ర వెంకన్న, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు బాలకృష్ణ, శివ, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.


మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన ఏసీ మిర్చి శాంపిల్ బస్తాలు

ఏసీ మిర్చి ధరల తగ్గుముఖం

- క్వింటాలుకు రూ.1,000 తగ్గుదల
- గత నెలలో రూ.20,200 ధర
- ప్రస్తుతం రూ. 17,000 నుంచి రూ. 18,200 వరకు మాత్రమే

ఖమ్మం మార్కెట్, జూలై 2: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో తేజా రకం ఏసీ మిర్చితో పాటు సాధారణ రకం నాన్ ఏసీ మిర్చి ధరలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి. మార్కెట్‌లో మంగళవారం క్వింటాలు మిర్చిని రూ. 19,500 జెండాపాట ధర నిర్ణయించినప్పటికీ నాణ్యత పేరుతో గరిష్ఠంగా క్వింటాలు రూ. 17,000ల నుంచి రూ.18,200 వరకు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో గత నెల 10న అత్యధికంగా క్వింటాలు రూ. 20,200 పలికిన మిర్చి ధరలు ఆ తరువాత క్రమేపీ తగ్గుతూ వస్తున్నాయి.

అంతే కాకుండా మార్కెట్‌లో సాధారణ రకం తేజ మిర్చి (నాన్ ఏసీ)ధరలు సైతం తగ్గుముఖం పట్టాయి. నెల క్రితం క్వింటాలు రూ. 19,000 వరకు పలికిన నాన్ ఏసీ మిర్చి ప్రస్తుతం క్వింటాలు నాణ్యతను బట్టి రూ.9,000 నుంచి రూ.17,000 వరకు మాత్రమే దక్కుతున్నాయి. మార్కెట్‌లో వ్యాపారులు కావాలనే ధరలు తగ్గిస్తున్నారని విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. ఈ ఏడాది మిర్చి పంట క్షేత్రాలలో తామర పురుగు, గుబ్బ, జెమిని వైరస్ తదితర తెగుళ్లతో దిగుబడి తగ్గి ఆందోళన చెందుతున్న రైతులకు మార్కెట్‌లో మిర్చి ధరలు తగ్గుముఖం పట్టడంతో వారి ఆశలు అడియాసలు అయ్యాయి. మార్కెట్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మిర్చితోపాటు, మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలలో పండిన తేజా రకం మిర్చిని రైతులు ఎక్కువగా అమ్మకానికి తీసుకొస్తుంటారు. ఇదిలా ఉండగా మంగళవారం మార్కెట్‌కు సుమారు 2 వేల మిర్చి బస్తాలు మాత్రమే అమ్మకానికి వచ్చాయి. తేజా రకం మిర్చికి చైనా, సింగపూర్, మలేషియా, థాయిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతులు ఉంటే ధరలు మరింతగా పెరుగుతాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం చైనా నుంచి భారీ ఆర్డర్లు లేక పోవడంతో పాటు అంతర్జాతీయంగా తేజా మిర్చికి డిమాండ్ లేకపోవడంతో ధర తగ్గుతుందని వ్యాపార నిపుణులు పేర్కొంటున్నారు. మిర్చి కొనుగోళ్లను మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి, గేడ్రటూ సెక్రెటరీ బజారు, ఏఎస్ వీరాంజనేయులు తదితరులు సమీక్షిస్తున్నారు.

- ఆధార్‌కార్డు లింక్‌తో బయట పడుతున్న అనర్హులు
- దివ్యాంగుల పింఛన్ పొందుతున్న వారిలో కొందరికి తర్వాత కాలంలో ప్రభుత్వ ఉద్యోగాలు
- పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు 'చేయూత' పింఛన్‌లు
- ఖమ్మం జిల్లాలో 227, భద్రాద్రి కొత్తగూడెంలో 200 పింఛన్లు ఇప్పటికే గుర్తింపు
- వారి నుంచి రికవరీ చర్యలు చేపట్టిన అధికారులు

దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, నిత్యవసరాలు, జీవన వ్యయంతో ఇబ్బంది పడే వారికి ప్రభుత్వం చేయూత(ఆసరా) పథకం ద్వారా దివ్యాంగులు, వయోవృద్ధులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, వితంతువులు, చేనేత కార్మికులు, హెచ్‌ఐవీ, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ వ్యాధిగ్రస్థులు ఇలా 9రకాల వారికి ప్రభుత్వం చేయూత పథకం ద్వారా పింఛన్ కల్పిస్తోంది. అనేక సంక్షేమ పథకాల్లో ఆధార్‌కార్డును ప్రమాణీకంగా వినియోగిస్తున్న ప్రభుత్వం దశాబ్దాలుగా అమలులో ఉన్న ఆసరా పథకానికి మాత్రం రేషన్‌కార్డును ప్రమాణిక అర్హతగా పరిగణించారు. కేవలం అర్హత కలిగిన వారికే సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వం భావించి చేయూత పింఛన్లుకు ఆధార్ లింక్‌ను అమలు చేయటంతో ఉమ్మడి జిల్లాలో వేలాదిగా అక్రమ పింఛన్లు బయటపడుతున్నాయి. ప్రస్తుతం రెగ్యూలర్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగాలు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సైతం చేయూత పింఛన్లు పొందుతున్నారని తెలిసి అధికారులు విచారణ చేపట్టారు.



'ఆసరా' లబ్ధిదారుల్లో అక్రమార్కులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 2: ప్రభుత్వం దశాబ్దాలుగా ఆసరా ఫించన్లు మంజూరు చేస్తోంది. 2018వరకు కేవలం రేషన్‌కార్డును అర్హతగా ప్రకటించి పింఛన్లు మంజూరు చేశారు. తర్వాత దశల వారీగా ఆధార్‌తో లింక్ చేశారు. 2017 తర్వాత ప్రత్యేక కేటగిరి, ఇతర విధానాలతో దివ్యాంగులకు ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టింది. అయితే అప్పటి వరకు దివ్యాంగుల కేటగిరిలో పింఛన్ పొందిన వారు ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన తర్వాత పింఛన్లు తొలగించుకోలేదు. ప్రభుత్వాలు దశల వారీగా పెంచుతూ పోయిన పింఛన్లు స్వీకరిస్తున్నారు. జిల్లాలు విభజన జరిగిన తర్వాత ఉమ్మడి ఖమ్మం జిల్లా విడిపోయింది. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సొంత నివాస స్థలం ఉన్న ఉద్యోగులు అక్కడ పింఛన్లు పొందుతూ ఖమ్మం జిల్లాలో ఉద్యోగాలు చేస్తున్నారు.

కొణిజర్ల మండలం కేంద్రంలో రెండు ప్రభుత్వశాఖలో ఇద్దరు ఉద్యోగులు ప్రభుత్వ రెగ్యూలర్ ఉద్యోగాలు చేస్తూ ఏళ్ల తరబడి ప్రభుత్వ చేయూత(ఆసరా) పింఛన్లు పొందుతున్నారు. ఖమ్మం నగరం, రఘునాథపాలెం మండలాల్లో కూడా ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ ప్రభుత్వం అందించే దివ్యాంగుల పింఛన్లు పొందుతున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. ఇలా ఉమ్మడి జిల్లాలో పదుల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ పింఛన్లు పొందుతున్నారని చర్చ జరుగుతోంది.

పదవీ విరమణ పొందిన వారికి...

భర్త ప్రభుత్వ ఉద్యోగం చేస్తూండగానే భార్యకు దివ్యాంగులు, వృద్ధాప్య, ఇతర పింఛన్లు మంజూరు జరిగాయి. భర్త మరణించిన తర్వాత అతని ఉద్యోగ పెన్షన్ భార్యకు ప్రభుత్వం వర్తింప చేసింది. ఇటీవల కాలంలో ఖమ్మంనగరంలో అక్రమంగా పింఛన్ పొందుతున్న మహిళ నుంచి రూ.1.8లక్షలు రికవరీ చేసి ప్రభుత్వానికి డీఆర్‌డీఏ అధికారులు తిరిగి పంపారు. ఈ క్రమంలో ప్రభుత్వశాఖల ద్వారా పెన్షన్ పొందుతూ ప్రభుత్వం మంజూరు చేసే పింఛన్‌ను పొందేవారి సంఖ్య పెరిగింది. దీంతో ఆధార్ లింక్ ద్వారా అక్రమ పింఛన్లు రాష్ట్ర స్థాయి అధికారులు వెలికితీసి జిల్లాలకు పంపారు. అక్రమంగా పింఛన్ పొందిన వారి నుంచి రీకవరి చేయాలని ఆదేశించారు. అక్రమ పింఛన్ పొందే వారి వివరాలు మండలాల వారీగా బోనకల్ 5, చింతకాని 7, ఏన్కూరు 1, కల్లూరు 4, కామేపల్లి 1, ఖమ్మం రూరల్ 10, ఖమ్మం మునిసిపాలిటీ 139, కొణిజర్ల 2, కూసుమంచి 3, మధిర మండలం 6, మధిర మునిసిపాలిటీ 4, ముదిగొండ 3, నేలకొండపల్లి 2, పెనుబల్లి 5, రఘునాథపాలెం 4, సత్తుపల్లి 1, సత్తుపల్లి మునిసిపాలిటీ10, సింగరేణి 3, తల్లాడ 1, తిరుమలయాపాలెం 4, వైరా 4, వైరా నగరం7, ఎర్రుపాలెం1

విచారణ చేస్తున్నాం: సన్యాసయ్య, డీఆర్డీవో

చేయూత పింఛన్లు పొందుతున్న వారికి ఆధార్ లింక్ ద్వారా అర్హత లేని వారు పింఛన్లు పొందుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నాం. ఇలా అక్రమంగా పింఛన్లు పొందుతున్న వారిపై ప్రజలు ఫిర్యాదులు చేయాలి. ఫిర్యాదులు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

సత్తుపల్లిలో నేడు వన మహోత్సవం

- ప్రారంభించనున్న మంత్రులు పొంగులేటి, తుమ్మల, సురేఖ
- జేవీఆర్ కళాశాలలో ప్లాంటేషన్, అవగాహన సదస్సు


6



జిల్లా పరిషత్‌లకు మరికొంత 'కాలం'

- ఖమ్మం, కొత్తగూడెం పాలకవర్గాలకు మరో నెల గడువు

6



పిడుగుపాటా? సాంకేతిక లోపమా?

- బీటీపీఎస్ ఘటనపై అనుమానాలెన్నో
- లైట్నింగ్ అరెస్టర్స్ ఎందుకు పనిచేయలేదు?

7



భద్రాద్రిలో మొదలైన బ్రేక్ దర్శనం

- మొదటి టికెట్ కొనుగోలు చేసిన ఈవో రమాదేవి

6


డీసీహెచ్‌ఎస్ గా రాజశేఖర్‌గౌడ్

హైకోర్టు ఆదేశాలతో ఉత్తర్వులు జారీ



ఖమ్మం కలెక్టరేట్, జూలై 2: వైద్య విధాన పరిషత్ జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారిగా డాక్టర్ రాజశేఖర్‌గౌడ్‌ను కొనసాగించాలంటూ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది ఆగస్టులో రాజశేఖర్‌గౌడ్ డీసీహెచ్‌ఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే అప్పటి వరకు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారిగా (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ బి. వెంకటేశ్వర్లు కొనసాగుతున్నారు. డీసీహెచ్‌ఎస్‌గా అప్పటి ప్రభుత్వం డాక్టర్ రాజశేఖర్‌గౌడ్‌ను నియమించగా బి. వెంకటేశ్వర్లు కోర్టుకు వెళ్లి తన పదవిని కొనసాగిస్తూ ఉత్తర్వులు తీసుకొచ్చారు. అప్పటి నుంచి డాక్టర్ బి. వెంకటేశ్వర్లు కొనసాగుతున్నారు. ఇటీవలె ఆయన నియామకాన్ని చాలెంజ్ చేస్తూ డాక్టర్ రాజశేఖర్ హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో డాక్టర్ రాజశేఖర్‌ను డీసీహెచ్‌ఎస్‌గా కొనసాగించాలంటూ హైకోర్టు ఆదేశించింది.

సీటు ఒక చోట.. చదువు మరోచోట



- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు, అకాడమీలలో చదువులు
- అనుమతులు లేకుండానే నీట్/జేఈఈ కోచింగ్, ఇంటర్ తరగతులు
- లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలు
- తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్న విద్యార్థులు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 2: ఖమ్మం నగరంలో వివిధ పేర్లతో నిర్వహిస్తున్న నీట్, జేఈఈ అకాడమీల (కోచింగ్ సెంటర్లు) బాగోతం విస్మయం కలిగిస్తోంది. కనీస అనుమతులు లేకుండా, నిబంధనలను ఇష్టారాజ్యంగా ఉల్లంఘిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీకి గురిచేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆకర్షణీయ ప్రచారాలతో, పీఆర్వోల సహకారంతో విద్యార్థులను పెద్దసంఖ్యలో చేర్పించుకొని లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. మరోవైపు లాంగ్‌టర్మ్, షార్ట్ టర్మ్ బ్యాచ్‌ల పేరుతో అటు ఇంటర్ తరగతులు, ఇటు నీట్/జేఈఈ తరగతులతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారనే అభిప్రాయాలున్నాయి.

నగరంలోని ఎన్‌ఎస్‌టి రోడ్డులో గల మెడికల్ అకాడమిలో సుమారు 300 మంది విద్యార్థులు నీట్, ఎప్‌సెట్ కోచింగ్‌తో పాటు ఇంటర్ చదువుతున్నారు. డే స్కాలర్స్‌కు ఒక్కో విద్యార్థి నుంచి రూ.లక్షా 50వేలు, హాస్టల్ విద్యార్థులకు రూ.2 లక్షల 50 వేలు వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో అకాడమిలో ఏడాదికి సుమారు రూ.50 లక్షల వరకు ఫీజుల రూపేణ వసూలు చేస్తున్నారని చెబుతున్నారు.

ఖమ్మంలో నిర్వహించే అకాడమీలలో ఎక్కువ మంది విద్యార్థులు గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లలు. 'మా అకాడమీలో చేరితే మీ పిల్లవాడు అతి కొద్దికాలంలోనే డాక్టర్ అవుతాడు..' అంటూ తల్లితండ్రులను నమ్మించి నిర్వాహకులు విద్యార్థులను చేర్చుకుంటున్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పొంది, ఈ మెడికల్ అకాడమీలలో ఇంటర్‌తో పాటు నీట్/జేఈఈ కోచింగ్ పొందుతున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు వచ్చినట్లు చూపుతూ ఆ విద్యార్థులను అకాడమీ పేరుతో అనుమతులు లేని ఇంటర్ కళాశాలల్లో విద్య అందిస్తున్నా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు ఎలా ఒప్పుకుంటున్నారో తెలియని పరిస్థితి.

నగరంలోని ఓ మెడికల్ అకాడమీ నిర్వాహకులు తిరుమలాయపాలెం మండలంలోని ఓ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ పొంది అదే కళాశాల హాల్ టికెట్‌తో కళాశాలకు వెళ్ళకుండ పరీక్ష రాసిన సంఘటన ఇందుకు ఉదాహరణ. అదే అకాడమీలో ఎక్కువ మంది విద్యార్థులు ఆ కళాశాలలో అడ్మిషన్లు పొంది అదే కళాశాల హాల్ టికెట్లపై పరీక్షలు రాస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. ఇలా మరికొన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు పలు అకాడమీలలో ఇంటర్మీడియట్ తరగతులకు హాజరై, నీట్, ఎప్‌సెట్ కోచింగ్ తీసుకుంటున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. ఇదిలావుండగా, భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన అకాడమీలు విద్యార్థుల పాలిటి శాపంగా మారుతున్నాయి. మార్కుల యంత్రాలుగా మారుతున్న విద్యార్థులకు ఆటాపాట, సాంస్కృతిక కార్యక్రమాలు, పిక్నిక్ వంటి రిక్రియేషన్ ప్రోగ్రామ్స్ ఉండవు. అందుకే ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థులు మానసిక ఒత్తిళ్ళకు గురవుతున్నారు. తమ పిల్లాడు ఐఐటీలో చదవాలనేది ప్రతీ తల్లిదండ్రుల కల. అందుకే చిన్ననాటి నుంచే అకాడమీలో చేర్పించి శిక్షణ ఇప్పిస్తారు, కాని ఆ అకాడమీలో పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకోకుండ పిల్లపై భారం మోపడం ఎంత వరకు కరెక్టో తల్లితండ్రులు ఒక సారి ఆలోచించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

అనుమతులు లేని కళాశాలలపై చర్యలు

కె రవిబాబు , జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

ఖమ్మం జిల్లాలో ఉన్న ప్రతి ప్రవేటు జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అనుమతులు తీసుకోవాలి. అనుమతులు లేని కళాశాలలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుంది. విద్యార్థులు, వారి తల్లితండ్రులు అనుమతులు ఉన్న జూనియర్ కళాశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలి. అందుకు ముందుగానే అనుమతులు ఉన్నాయో లేవో తెలుసుకోవాలి. నగరంలో నిర్వహించే అకాడమీలతో ఇంటర్మీడియట్ శాఖకు సంబంధం లేదు. అది మా పరిధికాదు. అకాడమీలలో అనుమతులు లేకుండా ఇంటర్మీడియట్ క్లాసులు నిర్వహిస్తే తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

స్పందించిన ఆపన్న హృదయాలు..

- గాయపడిన ఇంటర్‌విద్యార్థికి ఆర్థిక సాయం



సంపత్ (ఫైల్)

కారేపల్లి, జూలై2: మండల కేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయసంవత్సరం చదువుతున్న రామగిరి సంపత్ అనేవిద్యార్థి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడరు. ఓ ఆసుపత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. తల్లిదండ్రులు లేని నిరుపేద అయిన సంపత్ చికిత్స కోసం అవసరమైన ఖర్చులకోసం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహచలం దాతల సహకారం కోరారు. దీంఓ స్పందించిన కళాశాల సిబ్బంది, ఉమ్మడి ఖమ్మంజిల్లా ఇంటర్ విద్యార్థులు ముందుకు వచ్చి రూ.1,02,632 నగదును అందచేశారు. అందిన నగదును మంగళవారం ప్రిన్సిపాల్ సింహాచలం ఆసుపత్రిలో విద్యార్థికి సంబంధించిన వారికి అందజేశారు. దాతలు ముందుకు వచ్చి ఆర్థికంగా ఆదుకున్నవారికి కృత్ఞతలు తెలిపారు.

పీపుల్స్ మార్చ్‌కు ఏడాది వేడుకలు

- డీసీసీలో కేక్ కట్ చేసిన కాంగ్రెస్ శ్రేణులు



కార్పొరేటర్ మలీదుకు కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పోట్ల

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 2: సీఎల్‌పీ నాయకులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు మంగళవారంతో ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు వేడుకలు నిర్వహించారు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు కేక్ కట్ చేసి కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లుకు తినిపించారు. కార్పొరేటర్‌లు లకావత్ సైదులునాయక్, మాజీ కార్పొరేటర్ ఏ బ్లాక్ అధ్యక్షుడు యర్రం బాలగంగాధర్‌తిలక్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణను సత్కరిస్తున్న అహ్మద్

వేమూరిని కలిసిన అహ్మద్

పాల్వంచ టౌన్, జూలై 2: ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణను పాల్వంచ నేతాజీ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌జేకే అహ్మద్ మంగళవారం హైదరాబాద్ సంస్థ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా అహ్మద్ వేమూరిని శాలువా, బోకేతో ఘనంగా సత్కరించారు. అహ్మద్ ఆరోగ్యంపై వేమూరి అడిగి తెలుసుకున్నారు.

'పాలేరు' మళ్లీ వెలవెల

- 8.40 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- పొంచిఉన్న తాగునీటి గండం



పాలేరు జలాశయంలో అడుగంటిన నీటినిల్వలు

కూసుమంచి, జూలై 2: పాలేరు జలాశయం నీటిమట్టం మళ్లీ గణనీయంగా పడిపోయింది. 23 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి గాను 8.4 అడుగులకు పడిపోయింది. ప్రస్తుతం తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని వాడుతున్నప్పటికీ వర్షాలు పడకపోవడంతో భవిష్యత్తులో మరింత మంచినీటి విపత్తు నెలకొని ఉంది. భగీరథ ప్రాజెక్టుకు ప్రతి రోజు 150 క్యూసెక్కుల నీటిని వాడుతున్నారు. పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు, వరంగల్, సూర్యాపేట జిల్లాలకు, ఖమ్మం నగరానికి పాలేరు నీటిని వినియోగిస్తున్నారు. వేసవిని తలపిస్తున్న ఎండలతో తాగునీటి వాడకం ఏమాత్రం తగ్గలేదు. దీంతోపాటు సాగర్ జలాశయం నుంచి నీరు వచ్చేపరిస్థితి లేదు. నీటిపారుదలశాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఏప్రిల్లో నింపినా...

ఖమ్మంజిల్లాతో పాటు సరిహద్దు జిల్లాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు అందించే పాలేరు జలాశయం గత మార్చి, ఏప్రిల్ నెలల్లో అడుగంటింది. 23 అడుగుల నీటిమట్టానికి కనీస నీటిమట్టం నీటిమట్టం ఐదు అడుగులకు పడిపోయింది. దీంతో రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి చొరవ తీసుకుని సాగర్ జలాశయం నుంచి నీరు విడుదల చేయించారు. 4తేదీనుంచి సుమారు పది రోజుల పాటు పాలేరు జలాశయానికి నీరు విడుదల చేయించారు. ఆసమయంలో ఆయకట్టులో యాసంగి వరి సాగులో ఉండటంతో ఎక్కడా నీటిచౌర్యం జరుగకుండా నీటిపారుదల, రెవిన్యూ, పోలీస్ అధికారుల పర్యవేక్షణలో రేయింబవళ్లు గస్తీ ఏర్పాటుచేసి సాగర్ జలాలతో నింపారు. 18 అడుగులకు నింపారు. దీంతో సుమారు మూడు నెలల పాటు తాగునీటి అవసరాలకు సాగర్ జలాలను వినియోగించారు. మళ్లీ ఇప్పుడు నీటి మట్టం తగ్గింది. ప్రస్తుతం ఉన్న నీరు మరో 15, 20 రోజుల వరకు వస్తాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సాగర్ డ్యామ్‌లోనూ నీరు డెడ్‌స్టోరేస్ లో ఉంది. వర్షాకాలం మొదలై నెలవుతున్నా.. చిన్న, తేలికపాటి వర్షాలే తప్ప భారీ వర్షాలు రాలేదు. దీంతో ప్రజలకు తాగునీటి అవసరాల తీర్చేందుకు అధికార యంత్రాంగం ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంది.

బొగ్గుబ్లాక్‌లను వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ
5 నుంచి ఉద్యమ బాట

రుద్రంపూర్,(సింగరేణి) జూలై 2: సింగరేణి బొగ్గు బ్లాక్‌లను వేలంపాట నుంచి మినహాయించి సింగరేణికి కేఆయించాలని డిమాండ్ చేస్తూ జూలై 5న సింగరేణి వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించి మెమోరాండం ఇవ్వనున్నట్లు ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడెం శేషగిరిభవన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసీ) రాష్ట్రప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధానకార్యదర్శి మిర్యాల రంగయ్య పాల్గొని మాట్లాడారు. బొగ్గు గనుల వేలంపాటను వ్యతిరేకిస్తూ ఈ నెల 5న తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ప్రకటించారు. 6 నుంచి 12వ తేదీ వరకు కొత్తగూడెం ఏరియా, కొత్తగూడెం కార్పొరేట్ ఆధ్వర్యంలో సింగరేణి హెడ్డాఫీస్‌ముందు రిలే నిరాహారదీక్షలు నిర్వహించడం జరుగుతుందని 15న హైదరాబాద్‌లో జరిగే వేలంపాట వద్ద అన్ని కార్మికసంఘాల నాయకులతో కలిసి ధర్నా నిర్వహించి ఐక్యకార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గనిగల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో నేడు వనమహోత్సవం

- ప్రారంభించనున్న మంత్రులు పొంగులేటి, తుమ్మల, సురేఖ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లి, జూలై 2: రాష్ట్ర ప్రభుత్వం, ఆషా స్వచ్ఛంద సేవసంస్థ ఆధ్వర్యంలో బుధవారం సత్తుపల్లి నియోజకవర్గంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమాన్ని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ప్రారంభిస్తారని తెలిపారు. పెనుబల్లి మండలం గొల్లగూడెంలో మొక్కలు నాటిన అనంతరం సత్తుపల్లి చేరుకుని సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో మొక్కలు నాటి అనంతరం జరిగే అవగాహన సదస్సులో పాల్గొంటారని, తరువాత ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాకవి జయరాజు హాజరవుతున్నారని తెలిపారు. సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల వలన వాతావరణ కాలుష్యం పెరిగిపోతుందని, ఈ క్రమంలో మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. నాటిన మొక్కలను సంరక్షించుకుంటూ రానున్న రోజుల్లో రెండున్నర లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

మొక్కుబడిగా ఉపాధిహామీ ప్రజావేదిక



ప్రజావేదికలో మాట్లాడుతున్న అడిషనల్ పీడీ రవి

గుండాల, జూలై 2: ఉపాధి పనుల్లో పారదర్శకతకు ప్రభుత్వం చేపడుతున్న సామాజిక తనిఖీ అధికారుల, సామాజిక తనిఖీ బృందాల అలసత్వంతో నీరుగారి పోతుంది. ప్రజల సమక్షంలో నిర్వహించాల్సిన ప్రజా వేదిక ప్రజలు లేక వెలవెల పోయింది. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ రవి ఆధ్వర్యంలో 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనుల్లో మండలంలోని 11 పంచాయతీల్లో ఆడిట్ బృందాలు తనిఖీ నిర్వహించాయి. ఆయా పంచాయితీల్లో జరిగిన పనుల వివరాలు చదివి వినిపించారు. పనికి రాకపోయిన వారిక మస్టర్లు వేసి కూలి నగదు దుర్వినియోగం చేశారని, రికార్డులు నిర్వహించకుండా పనులు చేశారని తేల్చారు. పనుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయలేదని బృందాలు పేర్కొన్నాయి. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించకుండా ఇష్టానుసారం పనులు జరిగినట్లు తేల్చారు. సంతకాల ఫోర్జరితో మస్టర్లు రాసినట్లు తెలిపారు. మన ఊరు మన బడి సంబందిత ఈజీఎస్ పనుల రికార్డులు పరిశీలించకుండానే ఆడిట్ అధికారులు అలసత్వం చూపారని సంబంధిత ఏఈ ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు ప్రజా వేదికలో అక్రమాలపై తీసుకున్న చర్యలు తెలుపకుండానే సభను ముగించారు. కార్యక్రమంలో డీపీవో రమణ, ఏపీవో అనుష, జేక్యూసీవో అనిల్, ఏపీవో రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి: పోలీసులకు ఫిర్యాదు

మధిరరూరల్, జూలై 2: భర్త దశదినకర్మలకు హాజరైన భార్యపై భర్త తరుపు బంధువులు దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపురం గ్రామానికి చెందిన సుజాతకు కలకోట గ్రామానికి చెందిన జార్జితో వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. గత కొన్ని నెలల నుంచి భార్యభర్తలు మనస్పర్థలు వచ్చి విడివిడిగా ఉంటున్నారు. కాగా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె భర్త జార్జి మృతి చెందాడు. మంగళవారం సిరిపురం సమీపంలోని ఏటి వద్ద జరుగుతున్న దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సుజాతపై భర్త జార్జి తరపు వారు దాడిచేసి కొట్టారు. దీంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై మధిర రూరల్ పోలీసులకు సుజాత ఫిర్యాదు చేసింది.

భద్రాద్రిలో బ్రేక్ దర్శనం ప్రారంభం

● మొదటి టికెట్ కొనుగోలు చేసిన ఈవో



రూ.1.95 లక్షల హారం సమర్పించిన సిద్దిపేట భక్తులు

భద్రాచలం, జూలై 2: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం బ్రేక్ దర్శన సదుపాయం ప్రారంభమైంది. ఉదయం 9 నుంచి 9.30 వరకు, రాత్రి 7 నుంచి 7.30 వరకు ఈ బ్రేక్ దర్శనం కల్పిస్తారు. భక్తులు రూ.200 టికెట్‌పై స్వామివారిని నేరుగా శీఘ్రదర్శనం చేసుకునేందుకు దేవస్థానం అవకాశం కల్పించింది. ఈ బ్రేక్ దర్శనాన్ని భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె తొలి టికెట్‌ను కొనుగోలు చేసి మూలవరులను దర్శించుకున్నారు. అలాగే దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు సైతం టికెటర్ కొనుగోలు చేసి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఈ బ్రేక్ దర్శనాన్ని దేవస్థానంలో విశేష ఉత్సవాలు, కార్యక్రమాలు ఉన్న సమయంలో రద్దు చేసేందుకు లేదా వాయిదా వేసేందుకు అవకాశం ఉంటుందని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. బ్రేక్ దర్శనం సమయంలో అంతరాలయ అర్చనలు, ఉచిత, ప్రత్యేక దర్శనాలు నిలిపేయనున్నట్లు దేవస్థానం వర్గాలు తెలిపాయి.

రామయ్యకు సిద్దిపేట భక్తులు హారం సమర్పణ

భద్రాద్రి రామయ్యకు సిద్దిపేటలోని చందలపల్లుకు చెందిన చిటుకుల రంగారెడ్డి-లక్ష్మి దంపతులు ముత్యాలతో కూడిన శ్రీరామపరివార్ లాకెట్ హారంను సమర్పించారు. మంగళవారం రామలయాన్ని దర్శించిన వారు రూ.1.90 లక్షలు విలువైన ఈ హారంను దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి అందజేశారు. భద్రాద్రి దేవస్థానానికి ఏపీలోని అమలాపురం జిల్లా కల్లకూరుకు చెందిన భక్తులు రూ.25వేల విలువైన కూలర్, కూలింగ్ వాటర్ డిస్పెన్సర్ అందజేశారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారి జాకీర్ హుస్సేన్

రుద్రంపూర్, (సింగరేణి) జూలై 2: సెక్యూరిటి సిబ్బందిలో దేహదారుఢ్యం, మానసిక దారుఢ్యం వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని ఏరియా సెక్యూరిటి అధికారి ట్రైనింగ్ అధికారి ఎండి. జాకీర్ హుస్సేన్ అన్నారు. సింగరేణి సెక్యూరిటి సిబ్బందికి 77వ బ్యాచ్ పునఃచరణ శిక్షణ తరగతులను ఎస్అండ్‌పీసీ ట్రైనింగ్ సెంటరు కార్పొరేట్‌లో ఏర్పాటుచేయగా మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది నిబంధనలు పాటిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వహించి సంస్థకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇన్‌స్పెక్టర్ కే. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో రిజర్వేషన్ సౌకర్యం

- విద్యార్థులు వినియోగించుకోవాలి
- డీవైఎస్‌వో సంజీవరావు



పరుగుపందెంలో పాల్గొన్న విద్యార్థులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 2: క్రీడలతో రిజర్వేషన్ సౌకర్యం ఉందని, విద్యార్థులు వినియోగించుకోవాలని భద్రాద్రి జిల్లా డీవైఎస్‌వో కె.సంజీవరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం ప్రకాశం మైదానంలో నిర్వహించిన స్పోర్ట్స్ స్కూల్ పోటీలకు జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు క్రీడల పట్ల అవగాహన కలిగి ఉండేలా తల్లిదండ్రులు, సంరక్షకులు చూడాలన్నారు. నచ్చిన క్రీడను ఎంచుకొని అందులో శిక్షణ పొందితే ఉత్తమ ప్రదర్శన కనబరిచి రానిస్తారని సూచించారు. రాష్ట్రంలో ఉన్న కరీంనగర్, హకీంపేట్, ఆదిలాబాద్ ప్రాంతాలలో నాల్గొవ తరగతి చదివేందుకు చేపట్టిన ఈ పోటీలలో వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. 9 విభాగాలలో క్రీడాకారులు వివిధ మండలాల నుంచి 120 మంది జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ఈ పోటీలలో 14 మంది బాలురు, 10 మంది బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 9వ తేదీ, 10వ తేదీలలో హైదరాబాద్ హకీంపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు భద్రాద్రి జిల్లా తరుపున పాల్గొంటారని అన్నారు. ఈ క్రీడా ఎంపికల్లో ప్రభుత్వ పీఈటీలు స్టెల్లా, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి భట్టు ప్రేమ్ కుమార్, డివైఎస్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ ఉదయ్‌కుమార్, సిబ్బంది తిరుమలరావు, లక్ష్మణ్, వివిధ క్రీడా అసోసియేషన్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆభరణాల అందజేత



అమ్మవారికి ఆభరణాలను అలంకరిస్తున్న దాతలు

దుమ్ముగూడెం, జూలై 2: దుమ్ముగూడెం శ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి గొల్ల గీత, శ్రీకాంత్ దంపతులు మంగళవారం రూ23 వేల విలువ గల వెండి వడ్డాణాన్ని అందజేశారు. అలాగే అన్నదానానికి రూ.1116ల నగదుతోపాటు రూ.1116ల విలువైన పట్టుచీర, కుంకుమలను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబసభ్యులు తాళ్లపూడి నాగేశ్వర్రావు, లక్ష్మిదంపతులు పాల్గొన్నారు.

జడ్పీలకు మరికొంత 'కాలం'

- ఖమ్మం, కొత్తగూడెం పాలకవర్గాలకు మరో నెల గడువు
- ఆలస్యంగా ప్రమాణస్వీకారం చేయడమే కారణం



ఖమ్మం కలెక్టరేట్, జూలై 2: రాష్ట్రం వ్యాప్తంగా నేటితో జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పాలక వర్గాల పదవీ కాలం ముగుస్తుంది. కానీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్పీలకు మాత్రం మరో నెల రోజులు అవకాశం ఉంది. ఆ తర్వాతే వీటికి ప్రత్యేక అధికారుల పాలనకు అవకాశం ఉందని తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీపీలు, జడ్పీ చైర్పర్సన్ల పదవీకాలం జులై 3, 4తేదీల్లో ముగియనుంది. వాస్తవానికి 2019 మేలో ఖమ్మంలో 21, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 20 జడ్పీటీసీ, ఖమ్మం జిల్లాలో 289 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అదే ఏడాది జులై 3న మండల పరిషత్ పాలకవర్గాలు ఏర్పడ్డాయి. అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. జులై నాలుగో తేదీన రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్‌లకు పాలకవర్గాలు ఏర్పడగా ఆగస్టు 7న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జడ్పీలకు చైర్‌పర్సన్లు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ లెక్కన ఈ రెండు జిల్లాల జడ్పీ చైర్మన్లకు మరో నెల రోజుల పాటు పాలనలో ఉండే అవకాశం ఉంది. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను వాయిదా వేయగా తాజాగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను, జడ్పీ చైర్పర్సన్లు, ఎంపీపీల ఎన్నికలను వాయిదావేసి ప్రత్యేకాధికారులను నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాపరిషత్ అధికారులు ప్రత్యేక అధికారుల పాలన కోసం మరో నెలరోజుల్లో నివేదికలను సిద్ధం చేయనున్నట్లు తెలిసింది.

ఆయిల్‌పాం సాగు విస్తరణ లక్ష్యాలను పూర్తి చేయండి

● ఆయిల్‌పామ్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఆలపాటి రామచంద్రప్రసాద్

అశ్వారావుపేట, జూలై 2: ప్రభుత్వం నిర్దేశించిన ఆయిల్‌పామ్ తోటల విస్తరణ లక్ష్యాలను గడువులోగ పూర్తి చేయాలని ఆయిల్‌పామ్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ ఆయిల్‌ఫెడ్ డివిజనల్ అధికారి ఆకుల బాలకృష్ణకు సూచించారు. మంగళవారం ఆలపాటి ఆయిల్‌పామ్ తోటల విస్తరణ, లక్ష్యాల గురించి డివిజనల్ మేనేజర్‌తో చర్చించారు. పామాయిల్‌పై ఆసక్తి చూపే రైతులందరికి మొక్కలు సరఫరా చేయడంతో పాటు రాయితీని త్వరితగతిన అందేలా చూడాలని కోరారు. కనీస మద్దతు ధర రూ.15వేలకు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని, దిగుబడులు తగ్గుదలపై దృష్టి పెట్టాలని సూచించారు. దానిపై వివరాలను అడిగారు. వాతావరణంలో మార్పులవల్ల దిగుబడి తగ్గుతుందని, తోటల యాజమాన్య నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆశించిన దిగుబడి సాధించవచ్చుని అధికారులు తెలిపారు. కొత్తగ తోటలు వేసేవారికి పూర్తి అవగాహన కల్పించేలా క్షేత్రస్థాయి సిబ్బందిని రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పిడుగుపాటా..? సాంకేతిక లోపమా..?

- బీటీపీఎస్ ఘటనపై అనుమానాలెన్నో
- లైట్నింగ్ అరెస్టర్స్ ఎందుకు పనిచేయలేదు?
- నిర్వహణలో లోపాలూ కారణమే..
- ఘటనను తప్పుదారి పట్టించేందుకు యత్నాలు
- సమగ్ర విచారణతోనే నిజాలు వెలుగులోకి..


బీటీపీఎస్‌లో కాలిపోయిన జనరేట్ ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

మణుగూరు రూరల్, జూలై 2: దేశంలో ఇప్పటివరకు ఎక్కడా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలపై పిడుగులు పడిన దాఖలాలు లేవు. తొలిసారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని భద్రాద్రి థర్మల్‌పవర్ స్టేషన్(బీటీపీఎస్)లో మాత్రం గత శనివారం పిడుగు పడి సుమారు రూ.25 కోట్ల ఆస్తినష్టం సంభవించింది. యూనిట్-1 ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసే ప్రక్రియలో జనరేట్ ట్రాన్స్‌ఫార్మర్ సేవలే కీలకమైనవి. సుమారు రూ.25 కోట్ల విలువైన ఈ ట్రాన్స్‌ఫార్మర్ పైనే పిడుగు పడి తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని బీటీపీఎస్ సీఈ బిచ్చన్నతో పాటు ఈ ప్రమాదాన్ని పరిశీలించిన డైరక్టర్లు సైతం నిర్ధారించారు. అయితే అసలు పడరానిచోట పిడుగు ఎలా పడిందనే విషయాన్ని పక్కన పెట్టి అధికారులు మిగిలిన విషయాలపై దృష్టి సారిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లైట్నింగ్ వ్యవస్థ పనిచేస్తుందా.. లేదా ?

భారీ పరిశ్రమలు నిర్మించినప్పుడు దానికి ప్రకృతి నుంచి సంభవించే ప్రమాదమైన పిడుగు నుంచి రక్షణ కల్పించేందుకు లైట్నింగ్ అరెస్టర్స్ ఏర్పాటు చేస్తుంటారు. మణుగూరు బీటీపీఎస్‌లోనూ దీన్ని ఏర్పాటు చేశారు. అయితే ఆ తర్వాత ఈ పరికరాలు పనిచేస్తున్నాయా లేదా అనే విషయాలపై బీటీపీఎస్ ఉన్నతాధికారితో పాటు పర్యవేక్షణ అధికారగణం కూడా దృష్టి సారించలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్వహణ లేకనే ఇలా జరిగి ఉంటుందని పలువురు ఆరోపిస్తున్నారు. బీటీపీఎస్ ప్రాంతంలో ఐదు లైట్నింగ్ అరెస్టర్లు ఉన్నాయని అధికారులు చెబుతుండగా అయినా ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు ఎలా పడిందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. అసలు బీటీపీఎస్ ప్లాంట్‌పై ప్రధాన పర్యవేక్షణ అధికారి పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షించాల్సినవారు కేవలం కార్యాలయానికే పరిమిత మై ఇతర వ్యాపకాలతో కాలం వెళ్లదీస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇతర శాఖలపై కూడా ఉన్నతాధికారి ఆజమాయిషీ లేకపోవడంతో బీటీపీఎస్‌లో ఎవరికివారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

అనుమానాలెన్నో..

బీటీపీఎస్‌లో పిడుగు ఘటనపై ఎన్నో అనుమాలు తలెత్తుతున్నాయి. నిజంగా పిడుగు పాటుకే ప్రమాదం జరిగిందా లేక అధికారులు దీన్ని ఒక సాకుగా చూపుతున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జనరేట్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తాయా.. లేక షార్టు సర్క్యూట్ కారణమా.. లేదంటే మేయింటనెన్స్ లేక ఇంతటి విపత్తు జరిగిం దా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మెయింటనెన్స్ సరిగా లేకనే ఈ ప్రమాదం జరిగిందనే వ్యాఖ్యలూ వినిపిస్తున్నాయి. లైట్నింగ్ అరెస్టర్లు పనిచేయకపోవడానికి మెయింటనెన్స్ లోపమే కారణమని తెలుస్తోంది. బీటీపీఎస్ ఉన్నతాధికారులు తమ తప్పులను ఒప్పుకోకుండా ప్రకృతి వైపరిత్యాన్ని సాకుగా చూపి తప్పించుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నష్టానికి బాధ్యులెవరు ?

ఒకటి కాదు రెండు కాదు సుమారు రూ.25కోట్ల ప్రత్యక్ష నష్టంతో పాటు సుమారు రెండు నెలలపాటు నిలిపోయే విద్యుత్ ఉత్పత్తి నష్టాన్ని ఎవరు భరాస్తారు. ఎవరిని ఇందుకు బాధ్యతలను చేస్తారనే ప్రశ్నలు బీటీపీఎస్‌లో వినిపిస్తున్నాయి. ఒక వేళ మానవ తప్పిదాల వల్లనే ఇంతటి నష్టం జరిగిందని తేలితే ఎవరిపై చర్యలు తీసుకుంటారనేది కూడా ప్రశ్నార్థకంగా మారింది. జరిగిన ప్రమాదానికి 'పిగుడు'ను బూచిని చూపి మసిపూసి మారెడుకాయ చేయకుండా సరైన విచారణ చేస్తేనే ఈ ప్రమాదానికి అసలు కారణం తెలిసే అవకాశం ఉంది.

సమగ్ర నివేదికలు రూపొందించండి

● ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


బీటీపీఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్, జూలై 2: మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో పిడుగు పడి ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైన ఘటనపై సమగ్ర విచారణ చేసి నివేదికలు తయారు చేయాలని బీటీపీఎస్ అధికారులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం బీటీపీఎస్‌ను సందర్శించిన ఎమ్మెల్యే పిడుగు పడి ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైన సంఘటన స్థలాన్ని సందర్శించారు. సంఘటనకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పిడుగుపాటు వలన జరిగిన నష్టాన్ని, ప్రమాదానికి సంబంధించి పూర్తిస్థాయి వివరాలతో సమగ్ర నివేదిక త యారు చేయాలన్నారు. కార్యక్రమంలో జెన్కో థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య, విద్యుత్‌సౌద చీఫ్ ఇంజనీర్ రత్నాకర్, బీటీపీఎస్ సీఈ బిచ్చన్న, అధికారులు పాల్గొన్నారు.

సంపూర్ణ అభియాన్‌ను విజయవంతం చేయాలి

● కలెక్టర్ జితేష్ వి.పాటిల్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వివిధ భాగాల్లో అభివృద్ధిని వేగవంతంగా సాధించటానికి చేపట్టిన సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం నీతి అయోగ్ ఆపరేషన్ జిల్లా ఆపరేషనలో భాగంగా ఐడీఓసీ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని జిల్లా స్థాయి లో 4వ తేదీన, గుండాల మండలంలో జూలై 5వ తేదీన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, సీపీవో శ్రీనివాస్‌రావు, మహిళా శిశు సంక్షేమ అధికారి విజేత, జిల్లా వైద్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, వ్యవసాయాఖ ఏడీ సాయి, సీఎంవో నాగరాజశేఖర్, నవనీత్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై దృష్టి పెట్టాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి

రఘునాథపాలెం, జూలై 2: సీజనల్ వ్యాధులను నిర్మూలించేందుకు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మాలతి ఆదేశించారు. మంచుకొండ పీహెచ్‌సీ పరిధిలోని బూడిదంపాడులో నిర్వహించిన ఆశ సమీక్షా సమావేశంలో డీఎంహెచ్‌వో మాట్లాడారు. ఉదయం 7గంటలకే వైద్య సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాల్లో వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగమ్ ఆఫీసర్ డాక్టర్ బెజవాడ సైదులు, ఆశాలు పాల్గొన్నారు.

నాణ్యమైన పండ్లు సరఫరా చేయాలి

- ఐటీడీఏ పీవో రాహుల్


ఏజెన్సీదారులతో మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, జూలై 2: జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలలకు నాణ్యతతో కూడిన తాజా పండ్లు, ఫలాలు సరఫరా చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ సంబంధిత ఏజెన్సీదారులను ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్‌లో జీసీసీ, ఏజెన్సీల ద్వారా సరఫరా అయ్యే గతంలో వంట సామాగ్రి కోసం నిర్వహించిన టెండరు ప్రక్రియలో మిగిలిపోయిన సీజన్లను బట్టి సరఫరా చేసే వివిధ రకాలైన పండ్లకు సంబంధించి టెండరు ప్రక్రియలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు తాజా పండ్లు ఫలాలను సరఫరా చేయడానికి వచ్చిన ఏజెన్సీల ద్వారా వివిధ రకాల పండ్లు, నాణ్యతతో కూడినవి సరఫరా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్సీవో వెంకటేశ్వరరాజు, జీసీసీ డీఎం దావీదు, ఏవో నరేందర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అశ్వాపురం, జూలై 2: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. మంగళవారం అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రి రికార్డులు, సిబ్బంది హాజరుపట్టిక, మందుల నిల్వ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలకు 24 గంటలు వైద్యసేవలు అందించాలన్నారు. అనంతరం పశువైద్య కేంద్రాన్ని సందర్శించిన పీవో అక్కడ సిబ్బంది సరియైన సమాధానం ఇవ్వకపోవడంతో, వెటర్నరీ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

● ఎస్పీ రోహిత్ రాజు


ఆపరేషన్ ముస్కాన్-ఎక్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు, అధికారులు

కొత్తగూడెం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ పదో విడత కార్యక్రమం ఈ నెల 1 నుంచి 31వరకు జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో అమలు చేయడం జరుగుతుందని ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. మంగళవారం ఆపరేషన్ ముస్కాన్ ఎక్స్ అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతి సబ్ డివిజన్ పరిధిలో ఒక ఎస్‌ఐ, నలుగురు సిబ్బందిని ఒక బృందంగా నియమించడం జరిగిందని తెలిపారు. పోలీసుశాఖతోపాటు ఇతర శాఖల అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 5 ప్రత్యేక బృందాలు ఈ నెల రోజుల పాటు ఆపరేషన్ ముస్కాన్- ఎక్స్‌లో భాగంగా బాల కార్మికులను గుర్తించడానికి దాడులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎక్కడైనా బాల కార్మికులను గుర్తిస్తే వెంటనే 1098, డయల్ 100, స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ ఆపరేషన్ ముస్తాన్ - ఎక్స్‌కు జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్-ఎక్స్ బృందాల్లో నియమించబడిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో ఆపరేషన్ ముస్కాన్ ద్వారా రెస్క్యూ చేసిన పిల్లల యొక్క ప్రస్తుత పరిస్థితి గు రించి తెలుసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాస్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు రెడ్డి, విద్యాశాఖ అధికారి అన్నామని, లేబర్ డిపార్టుమెంట్ నుంచి షర్ఫుద్దీన్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సుమిత్రాదేవి, సాదిక్‌పాషా, ఐసీడీఎస్ అధికారి శివకుమారి, చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటరు సందీప్, ఎస్‌ఐలు రమాదేవి, విజయలక్ష్మి, రవి, తిరుపతి, సోమేశ్వర్, ఏసోబు, శ్రీనివాస్, పాల్గొన్నారు.

ప్రజారోగ్య విభాగం రద్దును విరమించుకోవాలి

● ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ సభ్యులు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రత్నాకర్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 2: తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య విభాగాన్ని రద్దు చేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజీజీడీఏ) కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. 142 జీవో అమలును దొడ్డిదారిన అమలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బాబు రత్నాకర్, డాక్టర్ సైదులు, ఉపాధ్యక్షుడు డాక్టర్ బాలు, టీఎన్జీవోస్ నాయకులు జైపాల్, తాళ్లూరి శ్రీకాంత్, వెంకటరమణ, జాబిసెట్టి శ్రీనివాసరావు, సుధాకర్ హరీష్, వేణుగోపాల్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లిలో పోడు వివాదం

- పరిష్కరించాలని ఎమ్మెల్యే కూనంనేనికి రైతుల వినతి


పోలీసులతో మాట్లాడుతున్న రైతులు

లక్ష్మీదేవిపల్లి, జూలై 2: మండల పరిధిలోని కూనారం గ్రామపంచాయతీలో రైతులకు, ఫారెస్ట్ అధికారుల మధ్య మంగళవారం పోడు భూములు వివాదం చోటుచేసుకుంది. గతంలో ఆ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసుకునే వారమని ఫారెస్ట్ అధికారుల జోక్యం చేసుకుని ఆ భూముల వైపునకు వెళ్లకుండ కందకాలు తీశారు. ఇదిలా ఉండగా సోమవారం రైతులు వ్యవసాయం చేసుకునేందుకు ఆ ప్రాంతంలోకి వెళ్లడంతో విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు అక్కడికిచేరుకోవడంతో రైతులకు, అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎంతో కాలంగా వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్న తమకు అన్యాయం చేస్తున్నారంటూ రైతులు ఫారెస్ట్ అధికారులతో ఘర్షణ పడ్డారు. పోలీసుల రంగ ప్రవేశంతో ఈ వ్యవహారం ఎమ్మెల్యే చెంతకు చేరింది. రైతులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును తన క్యాంపు కార్యాలయంలో కలిసి ఎంతోకాలంగా వ్యవసాయం చేసుకుంటున్న తమకు పట్టాలు ఇప్పించాలని ఫారెస్ట్ అధికారుల జోక్యం చేసుకోకుండ చూడాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే వాస్తవాలపై అధికారులతో చర్చించి అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని అనడంతో వివాదం సద్దుమణిగింది.

పేషెంట్ కేర్‌గానే పని చేస్తాం

- సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహించలేమంటూ

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన


కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి భవనంపైకి ఎక్కి ఆందోళన చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై2: పేషెంట్ కేర్‌గానే విధులు నిర్వహిస్తామని, ఉద్యోగాలు పొందిన మేము సెక్యూరిటీ గార్డుగా పని చేయలేమని ఐదుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. మంగళవారం కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి భవనంపై ఐదుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎక్కి తమ ఆవేదనను వెల్లబుచ్చారు. గత రెండేళ్ల క్రితం పేషెంట్ కేర్‌గా విధులకు ఎంపిక చేశారని, అందుకుగాను నెలకు జీతభత్యం రూ.16,800లు అందిస్తున్నారని తెలిపారు. కానీ ప్రస్తుతం పేషెంట్ కేర్‌గా కాకుండా సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహించమని అంటూ రూ.11,000లనే తమకు జీత భత్యంగా అందిస్తున్నారని స్పష్టం చేశారు. తక్షణమే తమను తీసుకున్న విభాగంలోనే కొనసాగించాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు జయకృష్ణ, నాగబాబు, సీతారామ్, శంకర్‌రావు, సరిలాల్ అన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న ఆసుపత్రి వైద్యాధికారులు పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. పోలీసులకు తమ ఆవేదనను విన్నవించుకొని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కిందకు దిగడంతో సమస్య సర్దుమనిగింది.

అగంతకుల దారిదోపిడి

● నగదు, ఆభరణాల అపహరణ

లక్ష్మీదేవిపల్లి, జూలై2: కారును ఆపిన వ్యక్తి కంట్లో కారం చల్లి దోపిడి చేసిన సంఘటన లక్ష్మీదేవిపల్లి మండలంలోని అనిశెట్టిపల్లి ఇల్లెందు క్రాస్ రోడ్డు మార్గమధ్యలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. అనిశెట్టిపల్లికి చెందిన వి. తిరుపతి తన వ్యక్తిగత పనిపై రాత్రి కారులో పాల్వంచకు వెళ్తున్నాడు. అనిశెట్టిపల్లి దాటిన తర్వాత మార్గమధ్యలో ఓ వ్యక్తి లిఫ్టు కావాలంటూ చేయి ఎత్తుగా అతడు కారు ఆపి సైడ్ అద్దాలు దించడంతో అగంతకుడు ఆయన కంట్లో కారం చల్లాడు. వెంటనే మరో ముగ్గురు కారును చుట్టుముట్టి బాధితుడిని బయటకు లాగి చంపేస్తామని బెదిరించారు. అతడి వద్ద ఉన్న రూ. 15వేల నగదు, రూ.లక్షా30వేల విలువ చేసే బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, లాక్కొని పరారయ్యారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, పోలీసులు చేరుకుని ఆ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఖమ్మం రూరల్, జూలై 2: పేకాట ఆడుతున్న 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఖమ్మం రూరల్ మండలం, వరంగల్‌క్రాస్ రోడ్డులోని ఆటోనగర్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ రామారావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 11 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 6వేల నగదు, 7 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

నేలకొండపల్లి, జూలై2: తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని పైనంపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉసిరికాయల రామకృష్ణ రోజూ మాదిరిగా తాటిచెట్టును ఎక్కి కల్లు గీస్తుండగా ప్ర మాదవశాత్తు జారి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు గాయపడిన అతడిని నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన లారీ

● సత్తుపల్లిలో ఘటన

సత్తుపల్లిరూరల్, జూలై2: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ నుంచి బాయిల్డ్ రైస్ లోడుతో కాకినాడ వైపు వెళ్తున్న లారీ సత్తుపల్లిలో విద్యుత్ స్తంభాన్ని ప్రమాదవశాత్తూ ఢీకొట్టింది. పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడంతో దీంతో కుడి వైపు రిలయన్స్ బంక్ వైపు వెళ్లిన దూసుకెళ్లిన లారీ జాతీయ రహదారి ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో వైర్లు తెగిపడగా మరోపక్క ఉన్న ఇంకొక స్తంభం సైతం విరిగిపోయింది. ఈ ప్రమాద సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రాణపాయం తప్పింది. ఈ ఘటనలో సుమారు 40బస్తాల బాయిల్డ్ రైస్ నేలపాలయ్యాయని డ్రైవర్ తెలిపాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఆడదూడల ఉత్పత్తే లక్ష్యం

- ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది 3,700 ఆడదూడల ఉత్పత్తికి కార్యచరణ
- ఇప్పటి వరకు 1,700 కృతిమ గర్భధారణ పూర్తి
- 63 మేలు జాతి దూడల ఉత్పత్తి


వైరాలోని పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయం

వైరా, జూలై2: పశువుల్లో మగదూడల పోషణ భారాన్ని తగ్గించేదానిలో భాగంగా ఆడదూడల ఉత్పత్తికి పశుగణాభివృద్ధి సంస్థ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. మేలుజాతి పశుసంపద ఉత్పత్తి కోసం పశుగణాభివృద్ధి సంస్థ రైతు సేవలో తరిస్తోంది. పశువుల్లో కృత్రిమ గర్భాధారణ ద్వారా గేదెలు, ఆవుల్లో మేలుజాతి దూడలు ఉత్పత్తి చేసేందుకు అనేక దశాబ్దాలుగా పశుగణాభివృద్ధి సంస్థ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోజురోజుకు రైతులకు తమ సేవలను విస్తరిస్తుంది. దానిలో భాగంగానే మగదూడల పోషణ భారాన్ని తగ్గించేందుకుగానూ కేవలం ఆడదూడల ఉత్పత్తి కోసం కృత్రిమ గర్భాధారణ చేసేందుకు అవసరమైన వీర్యనాలికలను పశుగణాభివృద్ధి సంస్థ రూపొందించింది. గత ఏడాది నుంచే కేవలం ఆడదూడల ఉత్పత్తికి సంబంధించిన కృత్రిమ గర్భాధారణ వీర్యనాలికలు అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో ఈ ప్రక్రియను చేపట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయం వైరాలో ఉంది.

వైరాలో దాదాపు 60ఏళ్ల కిందట ఈ పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని మండలాల్లో ఉన్న 225 పశువైద్యశాలకు 260 గోపాలమిత్రులు, 25మైత్రీల ద్వారా పశుగణాభివృద్ధి సంస్థ రైతులకు సేవలందిస్తుంది. వైరాలో మొదట ఘనీకృత వీర్య సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడే మేలైన ఆంబోతులు, దున్నపోతులను పెంచి వాటి నుంచి వీర్యాన్ని సేకరించి ద్రవ నత్రజనిలో నిల్వ చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మేలుజాతి పశుసంపద ఉత్పత్తి కోసం సరఫరా చేసేవారు. అయితే ప్రభుత్వానికి ఇది భారం కావడంతో 20ఏళ్ల కిందట వీర్యసేకరణ ప్రక్రియకు స్వస్తి పలికారు. ఆతర్వాత కరీంనగర్ నుంచి కృత్రిమ గర్భధారణకు సంబంధించిన వీర్యనాలికలను వైరాలోని పశుగణాభివృద్ధి సంస్థ కేంద్రంలో నిల్వ చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సరఫరా చేస్తున్నారు. ప్రతి ఏటా ఒక్కో గోపాలమిత్రుడికి 600పశువుల నుంచి కృత్రిమ గర్భధారణ ద్వారా దూడలను ఉత్పత్తి చేసే లక్ష్యాన్ని విధించారు.

102శాతం సక్సెస్ రేటు...

వైరా పశుగణాభివృద్ధి సంస్థ గడిచిన ఏడాది కృత్రిమ పశువుల్లో కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా 102శాతం లక్ష్యాన్ని సాధించింది. గత ఏడాది 3.30లక్షల పశువులకు కృత్రిమ వీర్యనాలికల ద్వారా కృత్రిమ గర్భోత్పత్తి చేయాల్సి ఉండగా, 3.36లక్షలు చేశారు. ప్రతి మూడు కృత్రిమ వీర్యనాలికల నుంచి కనీసం ఒక్క దూడనైనా ఉత్పత్తి సాధించడం లక్ష్యంగా ఉంది. అయితే 1.19లక్షల దూడల ఉత్పత్తి(102శాతం)సాధించారు. నల్లజాతికి చెందిన ముర్రా, మెహషానా రకాన్ని అలాగే తెల్లజాతి నుంచి ఒంగోలు, జెర్సీ, హెచ్‌ఎఫ్(హోల్‌స్టెన్), ప్రిషియన్, సాహీవాల్ రకాలను సాధించేందుకు కృత్రిమ గర్భదారణ వీర్యనాలికలను సరఫరా చేస్తున్నారు.


వీర్యనాలికలు, ద్రవనత్రజనిని నిల్వ చేసే జంబో కంటైనర్లు

రైతులకు సేవలు విస్తరిస్తున్నాం...

- డాక్టర్ కిషోర్, కార్యనిర్వహణ అధికారి, వైరా పశుగణాభివృద్ధి సంస్థ కేంద్రం



తమ కేంద్రం నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రైతులకు నాణ్యమైన సేవలను విస్తరించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. పశువుల్లో కృత్రిమ గర్భదారణ ద్వారా లక్ష్యాన్ని మించి దూడల ఉత్పత్తి సాధిస్తున్నాం. గోపాలమిత్రులు, మైత్రీలు, పశువైద్యశాలల నుంచి పశుగణాభివృద్ధి సంస్థ సేవలను రైతులకు అందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలను సాధిస్తున్నాం. ముఖ్యంగా ఈ ఏడాది నుంచి ఆడదూడల ఉత్పత్తే లక్ష్యంగా ప్రత్యేకంగా తయారుచేసిన వీర్యనాలికలతో పశువుల్లో కృత్రిమ గర్భదారణ చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నాం. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. దీంతో పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకోవచ్చు.

ఈ ఏడాది నుంచే ఆడదూడల ఉత్పత్తికి శ్రీకారం...

ఇప్పటివరకు కృత్రిమ గర్భాధారణ ద్వారా ఆడ, మగ దూడల ఉత్పత్తి జరిగేది. అయితే మగ దూడల పోషణ భారాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టారు. కేవలం ఆడదూడల ఉత్పత్తి సాధించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కేవలం ఆడదూడల ఉత్పత్తే లక్ష్యంగా 3,700వీర్యనాలికలు వైరాకు తీసుకువచ్చారు. ఇప్పటివరకు 1,700 వీర్యనాలికలను కృత్రిమ గర్భధారణకు వినియోగించారు. ఇప్పటికే 63 మేలు జాతి దూడల ఉత్పత్తి జరిగింది. ఇంకా 300నుంచి 400దూడలు ఉత్పత్తి జరుగనుందని అంచనాగా ఉంది. ఒక్కో వీర్యనాలికకు రూ.1,650ఖర్చవుతుంది. రైతులకు కేవలం రూ.250కే వీటిని సరఫరా చేస్తున్నారు. మిగిలిన రూ.1,400రాయితీ భారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయి. ఇప్పటివరకు 95శాతం ఆడదూడలు జన్మించాయి. 80శాతం సక్సెస్ రేటు ఉంది. సాధారణ వీర్యనాలికలను కేవలం రూ.130కే రైతులకు సరఫ రా చేస్తుంది. ఆడదూడల వీర్యనాలికలను మాత్రం రూ.250కు సరఫరా చే స్తున్నారు.


మణుగూరు ఓసీ విస్తరణ కోసం

ప్రజాభిప్రాయ సేకరణ

- ఏజెన్సీ చట్టాలను అనుసరించాలి
- రూ.20లక్షల నష్ట పరిహారం, ఉద్యోగం కావాలి: గిరిజనుల డిమాండ్
- రైతుల వ్యతిరేకతతో మరో మారు సమావేశం
- గిరజనేతరులకు కూడా సమాన ప్రాతినిధ్యాన్ని ఇవ్వాలి


గ్రామసభలో అధికారులతో మాట్లాడుతున్న రైతులు

మణుగూరు, జూలై2: మణుగూరు ఓసీ ప్రాజెక్టు విస్తరణ కోసం సోమవారం కొత్తకొండాపురం గ్రామంలో నిర్వహించిన పీసా గ్రామసభ రైతుల అభిప్రాయ సేకరణలో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. ఐటీడీఏ పీవో రాహుల్, సింగరేణి జీఎం దుర్గం రమేష్, మండల తహసీల్దార్ ఇతర అధికారుల సారథ్యంలో ఏర్పాటు చేసిన ఈ సభలో సింగరేణి మణగూరు ఏరియాలో మల్లెపల్లి ప్రాంతానికి చెందిన దాదాపు 90 ఎరకాల భూమిని మణుగూరు ఓసీ విస్తరణ కోసం సింగరేణి కాలరీస్ యాజమాన్యం రైతుల నుంచి సేకరించనుంది. ఇందుకు సంబంధించి అధికారులు మాట్లాడిన తర్వాత రైతులు నష్టపరిహార విషయాల్లో అభ్యంతరాలను వ్యక్తం చేశారు. గిరిజన నాయకులు నాగరాజు, స్థానిక నాయకులు కురం రవి, నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. గిరిజనులకు సంబంధించి ఎకరానికి రూ. 20 లక్షల నష్ట పరిహారం అందించి ఉద్యోగ అశకాశాన్ని కల్పించాలని, ఏజెన్సీలో భూసేకరణ చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలని నాగరాజు కోరగా, కురం రవి మాట్లాడుతూ తాతలదండ్రుల కాలం నుంచి ఇక్కడ ఉన్న భూమే ఆధారంగా బతుకుతున్న గిరిజనేతరులకు కూడా గిరిజన గిరిజనేతర అనే వ్యత్యాసాలు లేకుండా నష్టపరిహారాన్ని అందివ్వాలని కోరారు. ఇటీవల కాలంలో ఇక్కడ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న బీటీపీఎస్ ప్లాంట్‌లో నిర్వాసితులకు ఇచ్చినట్లు ఉద్యోగం నష్ట పరిహారం రెండు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే చెరువు సగభాగమే తీసుకని మిగతా చెరువు భాగాన్ని వదిలి వేయడమేమిటని ప్రశ్నించారు. అంతే కాకుండా ఇందుకు గానూ సింగరేణి అధికారులు చెప్పిన సమాధానంపై అభ్యంతరాలను వ్యక్తం చేశారు. కరకట్ట నిర్మాణాలు పక్కన ఉన్న రైతులకు తీవ్ర నష్టాన్ని చేకూర్చడమే తప్ప ఒరిగేది ఏమీ ఉండదని రైతులు పేర్కొన్నారు. సింగరేణి తీసుకునే విధానాన్ని స్వస్తి పలకాలని, చెరువు మధ్యగా కట్టపోస్తామనడం పక్కనే ఉన్న రైతాంగాన్ని పొమ్మన లేక పొగబెట్టే దోరణిని చూపుతుందన్నారు. సింగరేణి ఇక్కడ సేకరించే భూమి నష్టపరిహారం, ఉద్యోగాన్ని ఇస్తూ పక్కన ఉన్న రైతులకు, వారి పంట పొలాలకు కాలుష్య పరంగా, వ్యవసాయ సాగుపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలను చేపట్టిన నాడే ప్రాజెక్టు విస్తరణలకు సుముఖత రైతుల నుంచి లభిస్తుందని రైతులు తేల్చి చెప్పేశారు. దీంతో ప్రజాభిప్రాయ సేకరణ సభ గత్యంతరం లేక ముంగించాల్సి వచ్చింది, ఇదే విషయంపై మరో మారు సభ నిర్వహించే సమయంలో ఇరిగేషన్ అధికారులు, కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు కూడా హాజరు కావాలని రైతులు డిమాండ్ చేశారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

భద్రాద్రి
కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
బుధవారం 3 జూలై 2024

ధరణి పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయండి: కలెక్టర్

దమ్మపేట, జూన్ 21: ధరణీ పెండింగ్ దరఖాస్తులు మూడురోజులలో క్లియర్ చేయాలని తహసీల్దార్ నరేష్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డుల పరిశీలించటంతో పాటు ధరణీలో వచ్చిన దరఖాస్తులు ఎన్ని క్లియర్ చేశారు. చేయాల్సిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం పెండింగ్‌లో వున్న దరఖాస్తుల వివరాలను సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వచ్చిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకు లు, రైతులు కలెక్టర్‌ను కలిసారు. దమ్మపేట మండలంలో వున్న భూసమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా దమ్మపేట రెవెన్యూలో 1458, 884, 273 సర్వేనంబర్లలో గల భూసమస్యలు, అయ్యప్ప స్వామీ దేవాలయ భూమీ సమస్యను పరిష్కరించాలని చిన్నంశెట్టి యుగంధర్ కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం అనంతరం సమస్యలను పరిష్కరిచనున్నట్లు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- అధికారులకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదేశం
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష
- విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనే మొదటి ప్రాధాన్యమని వెల్లడి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట/దమ్మపేట, జూలై 2: ప్రతీ అధికారి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని, వైద్య, విద్య, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు తాను మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, ప్రత్యేక అధికారులు, వైద్య, విద్యుత్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యుఎస్, మిషన్ భగీరథ, రెవిన్యూ, వ్యవసాయ శాఖతో పాటు పలు శాఖల అధికారులతో పంచాయతీల వారీగ సమీక్షించారు. పంచాయతీలలో మంచినీటి సౌకర్యం, విద్యుత్, మౌలిక వసతులు, పాఠశాలలు ఎలా ఉన్నాయి, వాటికి ఏమి చేయాలి అనేదానిపై పంచాయతీ కార్యదర్శుల నుండి నివేదిక తీసుకొని ఆయా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరిత గతిన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. గాండ్లగూడెం పంచాయతీ కార్యదర్శి సాగర్ విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని, పద్దతి మార్చుకోవాలంటూ సున్నితంగా హెచ్చరించారు. మారుమూల ప్రాంతాలలో గర్భిణీలు ప్రసవ సమయంలో రహదారులు, వాహనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ ఇబ్బందిని తప్పించేందుకు ప్రత్యేకంగా అధికారులతో మాట్లాడి అవ్వల్ అంబులెన్స్ మంజూరి చేయించి వినాయకపురంలో అందుబాటులో ఉంచటం జరిగిందని, ఫోన్:8309059459 కి ఫోన్ చేసి ఈ అంబులెన్స్ సౌకర్యం ఉపయోగించుకోవచ్చునని ఆయన తెలిపారు. వైద్యులు అంబులెన్స్ సౌకర్యం ఉన్న విషయాన్ని మీ సిబ్బంది ద్వార, పంచాయతీ, ఇతర ప్రభుత్వ కార్యాలయాలలో అందరికి తెలిసేలా ఫోన్ నెంబర్‌ను డిసిప్లే చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అశ్వారావుపేట సీహెచ్‌సీని 100 పడకల ఆసుపత్రిగ అప్ గ్రేడ్ చేస్తూ మంజూరి వచ్చిందని, రూ.30.75 కోట్లు నిధులు కూడ మంజూరి అయ్యాయని ఆయన తెలిపారు. డా. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణలో పోస్టుమార్టమ్ గది లేదని, వెయిటింగ్ హాల్, సిబ్బందికి డ్రస్సింగ్ రూమ్ కూడ అవసరమని వీటిని మంజూరి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, ఎంపీటీసీలు తిరుమల, భారతి, కో ఆప్షన్ సభ్యులు పాషా పాల్గొన్నారు.

పారిశుధ్యం, ఆరోగ్యం విస్మరిస్తే చర్యలు

దమ్మపేట: గ్రామాలలో పారిశుధ్యం, ఆరోగ్యంపై చర్యలు తీసుకోవాలని సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హెచ్చరించారు. మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, మండల అధికారులతో మంగళవారం సమీక్షాసమావేశం నిర్వహించారు. వర్షాకాలం కావటంతో నీరు నిల్వవుండి ప్రజలు సీజనల్ వ్యాదుల బారిన పడే అవకాశం వుందని ముందస్తుగానే పారిశుధ్య చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామాలలో భగీరథ మంచినీరు వద్దంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సమస్యపై సంబందిత అధికారులతో మాట్లాడతానన్నారు. ఈసమావేశంలో జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాదు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, ఎంపీడీవో రవీంద్రారెడ్డి, ఎంపీవో రామారావు, వివిధశాఖాల అధికారులు పాల్గొన్నారు.

అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

- వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే పాయం సమీక్ష..
- నియోజకవర్గంలో ఎమ్మెల్యే బిజీ..బిజీ..
- జడ్పీ పాఠశాలలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే


పాఠశాలలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్, జూలై 2: సమీక్షలు, సమావేశాలతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం బిజీ..బిజీగా ఉన్నారు. తొలుత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి, మండల పరిషత్, మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖల అధికారులతో పలు సమస్యలపై సమీక్షా నిర్వహించారు.

ప్రభుత్వ శాఖల అధికారులు నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు చెరువుగా ఉండాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వివిధ శాఖల అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అందంచే సంక్షేమ పథకాలను అసలైన లబ్ధిదారులకు అందిస్తూ తెలియని వారికి పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలంలో ముంపుకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను యుద్ధప్రాతిపధికన పూర్తి చేయాలని, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సమస్యలను పరిష్కరించి నియోజకవర్గానికి మంచి పేరుతేవాలన్నారు. అగ్ని ప్రమాద బాధితుల వివరాలు సేకరించి రాబోయే ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల కేటాయింపులో ప్రాముఖ్యతనివ్వాలన్నారు. ఉచిత కరెంట్‌పై లబ్ధిదారులనుంచి ఫిర్యాదులు అందితే తక్షణమే పరిష్కరించాలన్నారు. శాశ్వత భవనాలు ప్రభుత్వ శాఖల వివరాలు తీసుకుని వాటికి స్థల కేటాయింపు పనులను చూడాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. మణుగూరు మున్సిపాలిటీలో రోడ్లను, కాల్వలను చెత్త, చెదారం లేకుండా శుభ్రంగా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, రెవెన్యూ మండల పరిషత్, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

మొక్కలను నాటడమే కాదు పరిరక్షించాలి...

సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టిన ఈ కార్యక్రమలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం కార్మికులతో పాటు తను మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో బాగంగా ప్రతీ ఒక్కరు బాద్యతగా మొక్కలు నాటాలని, మొక్కలు నాటడంతోపాటు సంరక్షణ బాద్యతలను కూడా తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ ఉమామహేశ్వరరావు, ఈఓఆర్‌డీ పల్నాటి వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం నాగశ్రీ, ఉపాధ్యాయుల బీ కిషన్, రవికుమార్, సరిత, రైల్వే వర్కర్స్ శివరామకృష్ణ, గురుమూర్తి, జీ నాగేశ్వరరావు, గోపి, మదుబాబు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని పంచాయతీగా మార్చాలని వినతి..

మణుగూరు మున్సిపాలిటీని తిరగి పంచాయతీగా మార్చాలని కోరుతూ.. సీపీఐ పార్టీ ఆద్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఐ నాయకులు డీ సుధాకర్, జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు మున్నా లక్ష్మీకుమారి మాట్లాడారు. 2005లో పంచాయతీని రద్దు చేసి మున్సిపాలిటీగా మార్చారని, నాటి నుంచి మున్సిపాలిటీలో అధికంగా నివాసముండే ఎస్‌సీ,ఎస్‌టీ, బీసీ, మైనార్టీ పేద ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మంగి వీరయ్య, తోట రమేష్, కోటేశ్వరరావు, ప్రసాద్, సీతారాములు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టిగా పనిచేద్దాం

- అన్ని శాఖల అధికారులకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని
- విజ్ఞప్తి సుజాతనగర్‌లో సమీక్ష


మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

సుజాతనగర్, జూలై 2: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అన్ని పార్టీలు, అధికారులతో కలిసి ముందుకు పోదాం అని అప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యేకి తహశీల్దార్ శిరిష, ఎంపీపీ భూక్యా పద్మావతి మొక్కను అందించి స్వాగతం పలికారు. దీనిలో భాగంగా మండలంలోని సమస్యలను ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేకి వివరించారు. ముందుగా సీపీఎం రాష్ట్ర నాయకులు కాసాని అయిలయ్య మాట్లాడుతూ మండలంలో విద్యా వనరులకు కొదవ లేదని, మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు సహకరించాలన్నారు. టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు ఎల్ఆర్ఎస్ త్వరగా వచ్చేలా చూడాలన్నారు. కాంగ్రెస్ నాయకులు చింతలపుడి రాజశేఖర్ పంచాయతీలో 90 శాతం రోడ్లు పూర్తయ్యాయని ఇంకా మిగిలిన సీసీ రోడ్ల నిర్మాణానికి చొరవ చూపాలని, డ్వాక్రా మహిళలకు మండల భవనం లేదని, అంగన్‌వాడీ పక్కన ఎమ్మెల్యే వెంకటరెడ్డి టైంలో స్థలం కేటాయించి, శిలా ఫలకం వేసి చాలా సంవత్సరాలు దాటిందని, వారికోసం సమావేశ భవనాన్ని నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ గడచిన కాలమంతా అభివృద్ధి కోసం అహర్నిషలు శక్తి వంచన లేకుండా మంత్రులు, అధికారుల వద్దకు తిరిగానని దీని చలువతోనే సుమారు 250 కోట్ల రూపాయల పనులు మంజూరయ్యాయని అన్నారు. ప్రతి సమస్యకు తప్పక పరిష్కారం లభిస్తుందని, ఆదిశగా ప్రణాళికా బద్దంగా ముందుకు సాగుతున్నానని అన్నారు. అనిశెట్టి పల్లి నుంచి సర్వారం మీదుగా పాల్వంచ వరకు బైపాస్ రోడ్ నిర్మాణానికి చర్యలు, రెండు బైపాస్ రోడ్ల నిర్మాణంతో పాటు, సీతారామ కెనాల్ నీటి సమస్యలతో పాటు అన్ని సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారులు, అన్ని పార్టీల నాయకులతో కలిసి సమష్టిగా ముందుకు సాగుదామని, మీరంగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం ప్రజలనుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. దీనిలో ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్‌పాషా, సొసైటీ అధ్యక్షుడు మండే వీర హనుమంతరావు, ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, ఎంపీపీ భూక్యా పద్మ ఎంపిటీసీలు భద్రం, గణేష్, సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్, సపీఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు, టీడీపీ నాయకులు చిలకారెడ్డి, నాయకులు తాళ్లూరి ధర్మారావు, ఆదర్శ రైతు పాపారావు, కొమారి కృష్ణ, కొమారి హనుమంతరావు, బొడ్డు కేశవరావు, కత్తి వెంకన్న, లక్ష్మీనారాయణ, కోటేష్ తదితరులు ఉన్నారు.

రోడ్డును విస్తరించి డ్రెయినేజీని ఏర్పాటు చేయండి

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లకు స్థానికుల వినతి



మణుగూరు, జూలై 2: మణుగూరు పట్టణ ప్రదాన రహదారి అంబేద్కర్ సెంటర్ నుంచి కట్టుమల్లారం వరకు గల సింగిల్ రోడ్డును విస్తరించి పటిష్టమైన డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయించాలని కోరుతూ స్థానికులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు సోమవారం రాత్రి వినతి పత్రాన్ని అందించారు. స్థానికులు కుడిపూడి వెంకటేశ్వరరావు, దొబ్బల వెంకటప్పయ్య న్యాయవాది కందిమళ్ల నర్సింహారావు, పూజారినగర్ వాసులు కుడితిపూడి కోటేశ్వరరావు, జీవీ, తదితరులు మాట్లాడుతూ పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి చిన్న రావిగూడెం వరకు సింగిల్ రోడ్డు కావడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇసుక లారీల వల్ల సింగిల్ రోడ్డుపై మరే ఇతర వాహనాల రాకపోకలు చేయలేని దుస్థితిని నెలకొల్పుతున్నాయని తెలిపారు. అంతే కాకుండా సరైన డ్రెయినేజీ వ్యవస్థ రోడ్డుకు ఇరువైపులా లేకపోవడంతో వర్షం పడితే రోడ్డు పలు చోట్ల జలమయం అవుతుందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యేకు తెలుపుతూ వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో తిరుమల్లేష్, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలి

- బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్ దిష్టిబొమ్మ దహనం

పాల్వంచ టౌన్, జూలై 2: పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని భేషరత్తుగా హిందు సమాజానికి భేషరత్తుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం పార్లమెంట్ సమావేశంలో తాను మాట్లాడుతూ హిందు సమాజంపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్‌సెంటరులో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ హిందూవులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ వైఖరి పట్ల దేశంలోని హిందువులే కాక ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందు సమాజం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయన్నారు. హిందుసమాజానికి క్షమాపణ చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో పాల్వంచ పట్టణ అధ్యక్షులు రాపాక రమేష్, నర్సుదాసు, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పదెకరాలలోపు వారికే రైతు భరోసా ఇవ్వాలి

దుమ్ముగూడెం/మణుగూరు, జూలై 2: పదెకరాలలోపు రైతులకు మాత్రమే రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తే బావుంటుందని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు. దుమ్ముగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయ ఆవరణలో మంగళవారం రైతులతో మహాజన సభ నిర్వహించారు. రైతుల సలహాలు, సూచనలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపుతామని ఏడీఏ సుధాకర్‌రావు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు కిలిమి ఎల్లారెడ్డి, డైరెక్టర్లు యలమంచి శ్రీనివాసరావు, బొల్లి సూర్యచంద్రరావు, లక్ష్మీపతిరావు, పూర్ణయ్య, వెంకటేష్, చలపతి, చినవెంకట్రావు, మానిటరింగ్ అధికారి సుజాత, కార్యదర్శి హిమబిందులు పాల్గొన్నారు.

మణుగూరు: మణుగూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నేడు గుట్టమల్లారం గ్రామంలోని రైతు వేదికలో ఉదయం 10 గంటలకు రైతు భరోసా పదకంపై రైతుల అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు తెలిపారు. మండల రైతు సోదరులు ఈ కార్యక్రమానికి సకాలంలో తప్పని సరిగా హజరై తమ అభిప్రాయాలను తెలపాలని కోరారు.

చిన్నారులకు ఆటాపాటలతో విద్యనందించాలి

జూలూరుపాడు, జూలై 2: అంగన్‌వాడీ కేంద్రాలలో నమోదైన చిన్నారులకు ఆటాపాటలతో కూడిన విద్యను అందించాలని చంద్రుగొండ ప్రాజెక్ట్ సీడీపీవో సీహెచ్.నిర్మలజ్యోతి తెలిపారు. 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలకు అందించవలసిన పూర్వ ప్రాథమిక విద్యపై మంగళవారం మండలంలోని పడమటనర్సాపురం రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని చిన్నారులకు విద్యా బోధన సాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ ఎమ్.నాగమణి, గంగాజలం, సూపర్ వైజర్లు డి.శకుంతల, లక్ష్మీ, పాల్గొన్నారు.

పోడు రైతులకు రుణాలు ఇప్పించేందుకు కృషి..

పాల్వంచ రూరల్, జూలై 2: ఏజెన్సీ ప్రాంత గిరిజన రైతులకు పోడుభూములు, పట్టాలు ఉన్న ప్రతి ఒక్కరికి రుణాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఉల్వనూరు, మల్లారం, చంద్రాలగూడెం ఏజెన్సీగ్రామాల్లో పర్యటించి అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోడుసాగు చేస్తున్న గిరిజన రైతులకు రుణ సౌకర్యం కల్పించేవిధంగా చర్యలు చేపట్టిందన్నారు. బ్యాంకు అధికారులతో రుణాల మంజూరీ కోసం మాట్లాడినట్లు చెప్పారు. ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు రుణసహాయం అందించడం వల్ల పెట్టుబడుల కోసం అధికవడ్డీలకు అప్పులు చేసే అవకాశం లేకుండ ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వర్ణలత, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర నిర్ణయించాలి

అశ్వారావుపేట, జూలై 2: వ్యవసాయ రంగంలో స్వామినాధన్ సిఫార్సులు అమలు చేయాలని, ధాన్యానికి మద్దతు ధర నిర్ణయించాలని తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర కమిటీ సభ్యులు కె పుల్లయ్య మాట్లాడుతూ సాగు ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయని, పెరిగిన ఖర్చులకు అనుగుణంగా పంట ధరలు పెరగటం లేదన్నారు. రైతులను ఆదుకునేలా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలని కోరారు. స్వామినాధన్ కమిటీ సిఫారుసులను అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తగరం జగన్నాదం, గడ్డం సత్యనారాయణ, గడ్డం వెంకటేశ్వరరావు, కలపాల భద్రం, సీసం రాముడు పాల్గొన్నారు.

భావనకు పీవీకే 5 మేనేజరు అభినందనలు


విద్యార్థిని అభినందిస్తున్న మేనేజర్

రుద్రంపూర్, (సింగరేణి) జూలై 2: కర్నాటక రాష్ట్రంలోని బాగల్‌కోట్‌లో గత నెలలో జరిగిన ఖేల్ ఇండియా ఉషు ఉమెన్స్ లీగల్ 45కేజీల విభాగంలో భద్రాద్రి జిల్లాకు చెందిన జి. భావన పాల్గొని నాల్గొవ స్థానంలో నిలిచింది. మంగళవారం పీవీకే 5 మేనేజరు పి. శ్రీనివాస్ చేతుల మీదుగా సర్టిఫికెట్ ప్రధానం చేసి అభినందించారు. ఉషు రాష్ట్ర అధ్యక్షుడు పి. పరిపూర్ణాచారి భావనని, సీనియర్ కోచ్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉషు కోచ్ రఘు, భీమ్‌రాజ్, రుద్ర తేజ, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: బీజేవైఎం

భద్రాచలం, జూలై 2: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బీజేవైఎం రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు నిరుద్యోగ సమస్యలపై భద్రాచలం మండల తహసీల్దారు శ్రీనివాసరావుకు బీజేవైఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూప్-2, 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని, 25 వేల టీచరు పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని, ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను మార్చి నూతన తేదీలను ప్రకటించాలన్నారు. అన్ని నియామకాల్లో మహిళ అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషను కల్పించాలని కోరారు.

బాధిత కానిస్టేబుల్‌కు చెక్కు అందజేత


కానిస్టేబుల్‌కు చెక్కు అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : గత సంవత్సరం డిసెంబరులో బూర్గంపాడు వద్ద రోడ్డు ప్రమాదంలో కాలు కొల్పోయిన ఏఆర్ కానిస్టేబుల్ శ్రీరామ్‌కు మంగళవారం ఎస్పీ రోహిత్‌రాజు రూ.7లక్షల చెక్కు అందజేశారు. రోడ్డు ప్రమాదానికి గురై కాలుకొల్పోయిన కానిస్టేబుల్ శ్రీరామ్ చికిత్స తీసుకుని కృత్రిమకాలు ధరించడానికి సెంట్రల్ ఫాగ్ ఫండ్ నుంచి ఈ నగదును అందచేసినట్లు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి విధులకు హాజరవుతూ నిత్యం ప్రయాణాలు చేసే పోలీస్ అధికారులు, సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ ఏవో జయరాజు, సూపరింటెండెంట్ సత్యవతి, ఆర్ఐ నర్సింహారావు పాల్గొన్నారు.

బీమా చెక్ పంపిణీ

అశ్వాపురం, జూలై 2: మండల పరిధిలోని జగ్గారం గ్రామానికి చెందిన సోడె వెంకన్న కుటుంబానికి పినపాక మాజీఎమ్మెల్యే రేగా కాంతారావు రూ.2లక్షల బీమాచెక్‌ను మంగళవారం అందజేశారు. వెంకన్న ఇటీవల ప్రమాదవశాత్తూ మరణించగా అతను బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండటంతో పార్టీ ఇన్సూరెన్స్ ద్వారా మృతుని భార్య సత్తెమ్మకు మణుగూరు పార్టీ కార్యాలయంలో రేగా అందజేశారు. కార్యక్రమంలో జగ్గారం మాజీ సర్పంచ్ సున్నం రాంబాబు, నాయకులు వట్టం రాంబాబు,కృష్ణ,జావిద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

రేపు మోరంపల్లిబంజర సంత బహిరంగ వేలం

బూర్గంపాడు, జూలై 2: బూర్గంపాడు మండల పరిదిలోని మోరంపల్లిబంజర గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే వారపుసంత బహిరంగ వేలం గురువారం పంచాయతీ కార్యలయంలో నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి భవానీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పరిదిలో ప్రతి గురు, శుక్రవారాలు నిర్వహించు వారపుసంత వేలంను గురువారం ఉదయం 11గంటలకు గ్రామపంచాయతీ కార్యలయంలో అధికారుల సమక్షంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సికిల్‌సెల్, ఎనిమియాపై అవగాహన

భద్రాచలం, జూలై 2: భద్రాచలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు సికిల్‌సెల్ ఎనిమియాపై అవగాహన కార్యక్రమంను ఏరియా వైద్యశాల సిబ్బంది నిర్వహించారు. ఆర్ఎంవో, సికిల్‌సెల్ ఇన్‌చార్జ్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనిమియాకు సంబంధించి విద్యార్థినులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఎవరికైనా రక్తహీనత సంబంధిత సమస్యలుంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలని కోరారు. సకాలంలో గుర్తిస్తే సమస్యను త్వరగా నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమ, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రత్న పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శంకర్

ములకలపల్లి, జూలై 2: బీజేపీ మండల అధ్యక్షుడిగా గుగులోత్ శంకర్ నియమితులయ్యారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కేవీ. రంగాకిరణ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మడవి రవి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

సకిని కుటుంబానికి నిత్యావసరాల అందజేత

మణుగూరుటౌన్, జూలై 2: మణుగూరు మండలం కూనవరం గ్రామానికి చెందిన పద్మశ్రీ గ్రహిత సకిని రామచంద్రయ్య కుటుంబానికి 'మేము సైతం' మిత్రమండలి ఆధ్వర్యంలో 2 క్వింటాళ్ల బియ్యం, రెండు నెలలకు సరిపడ నిత్యావసరాలు వితరణగా అందజేశారు. మంగళవారం మిత్రమండలి అధ్యక్షులు దోసపాటి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు రామచంద్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు బేతంచర్ల వెంకటేశ్వరరావు, మార్తి శ్రీనివాసరావు, రంగా శ్రీనివాస్, చిందుకూరి ఏడుకొండలు, మల్లిఖార్జున్, ఎంపీపీ కోటేశ్వరరావు, సర్పంచ్ ఏనిక ప్రసాద్, వల్లభనేని రమణ, గోద్రెజ్ రమణ, మేకల గోపి, రాబిన్‌కుమార్, వాసు తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాలతో ఎన్‌డీ నేతకు వీడ్కోలు

ఇల్లెందు టౌన్, జూలై 2 : న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఇప్టూ రాష్ట్ర కమిటీ సభ్యుల ఎల్. విశ్వనాథం హఠర్మరణం చెందగా మంగళవారం పార్టీ కార్యకర్తలు, ప్రజలు అశ్రునయనాలతో కడసారి వీడ్కోలు పలికారు. ఇల్లెందు పట్టణంలోని 21 పిట్ వద్ద జరిగిన సంతాపసభలో న్యూడెమోక్రసీ కేంద్రకమిటీ ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు భౌతికాయంపై పూల మాలలు వేసి నివాళులర్పించి అనంతరం మాట్లాడుతూ విశ్వనాథం పేద, దళిత కుటుంబంలో పుట్టి విప్లవనాయకుడిగా ఎదిగారని, చివరి ప్రాణం వరకు విప్లవకారుడిగా జీవించారని కొనయాడారు. ఈ సంతాపసభలో న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు రాయల చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సీపీఐ డివిజన్ కార్యదర్శి బందం నాగయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దొడ్డా డానియల్, పవర్ హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఉపేందర్‌రావు, ఎం. శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. అనంతరం అంతిమయాత్ర 21ఫిట్‌సెంటర్‌నుంటి రొంపేడు వరకు నిర్వహించి పార్టీ సాంప్రదాయాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

సారధి ఏరి!

- జవసత్వాలు నింపేదెవరు !
- నేడు బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశం
- పాల్గొననున్న ఎంపీ, ఎమ్మెల్సీ, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు

భద్రాచలం, జూలై 2: పార్టీ ఆవిర్భవించిన తరువాత తొలిసారి భద్రాద్రి అసెంబ్లీలో సాధించిన విజయం అంతలోనే ఆవిరైంది. ఊహించని రీతిలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నిరాశ అలుముకుంది. పార్టీ అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించిన నాయకునికి కష్టపడి పని చేసి గెలిపించినా ఆ సంతోషం ఎంతో సేపు నిలవలేదని బీఆర్ఎస్ శ్రేణులు వాపోతున్నాయి. ఇంతలో పార్లమెంటు ఎన్నికలు రావడం, గతంలో ఉన్న మహబూబాబాద్ స్థానంను కోల్పోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నిరాశ, నిస్తేజం అలుముకుందని ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులే పేర్కొంటున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరడంతో నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎవరిని నియమిస్తారనే దానిపై ఎన్నికల సమయంలో అధిష్టానం ఆచితూచి వ్యవహరించి సమన్వయ కమిటీని నియమించింది. ఎన్నికల అనంతరం నియోజకవర్గ సారధిపై స్పష్టత వస్తుందని ఆశించినా ఇంత వరకు దానిపై ఎటువంటి కదలిక లేకపోవడంతో ఇంతకీ సారధిని ఎవరిని నియమిస్తారు? అనే ప్రశ్న సర్వత్రా వ్యక్తమవుతోంది. కాగా నియోజకవర్గంలో తొలి నుంచి పార్టీ పట్ల అంకితభావంతో పని చేస్తున్న తమకు అవకాశం దక్కవచ్చని పలువురు నాయకులు ఆశిస్తుండగా మరోవైపు ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన వారి పేరు సైతం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ల జాబితాలో తెరపైకి వస్తున్నాయి. దీనిపై ఎటువంటి స్పష్టత రానప్పటికీ త్వరలోనే భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంకు ఇన్‌చార్జిని నియమించే అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. రాబోయే కాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు సైతం ఉండే అవకాశాలు ఉండటంతో ఈ పరిస్థితుల్లో నియోజకవర్గంలోని నాయకులు, క్యాడర్‌ను నడిపేందుకు సారధి పోస్టు భర్తీ చేయడం ఎంతో అత్యవసరమని ఆ పార్టీ నాయకులే పేర్కొంటునారు. ఈ పరిస్థితుల్లో బుధవారం దుమ్ముగూడెం మండలం గంగోలులో నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో రాజ్యసభలో బీఆర్ఎస్ ఉప నాయకుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే , బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావుతో పాటు పలువురు నాయకులు పాల్గొననున్నట్లు ఆపార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల రాజకీయంగా చోటు చేసుకుంటున్న పరిణామాలు, పార్లమెంటు ఎన్నికల సమయంలో ఓటింగ్ సరళి, పార్టీ బలోపేతంతో పాటు నాయకులు, క్యాడర్‌లో జవసత్వాలు నింపేందుకు చేపట్టాల్సిన చర్యలు, నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎవరిని నియమించాలనే అంశాలపై మనోగతం సేకరించే అవకాశాలు ఉన్నాయి.